నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం | 05 అక్టోబర్ 2023 | www.navatelangana.com

జూనియర్ లైన్‌మెన్ ఫలితాల్లో 'యంగ్ మైండ్స్ అకాడమీ' విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-సంగారెడ్డి



విద్యుత్ శాఖలో ఇటీవల ప్రకటించిన జూనియర్ లైన్‌మెన్ ఫలితాల్లో యంగ్ మైండ్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ.. స్థాపించిన మొదటి సంవత్సరంలోనే అకాడమీ విద్యార్థులు 36 మంది జూనియర్ లైన్ మెన్స్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఎంపికైన 36 మందికి అభినందనలు తెలిపారు. వారు మంత్రి జగదీశ్వర్‌రెడ్డి చేతుల మీదగా నియామక పత్రాలు అందుకున్నారన్నారు. విజయమే లక్ష్యంగా విద్యార్థులను పరీక్షల కోసం సన్నద్ధం చేస్తున్నామన్నారు.

బక్కి వెంకటయ్యకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-కొండపాక



తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన బక్కి వెంకటయ్యను పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, కొండపాక ఎంపీటీసీలు మంచాల అనసూయ కనకరాములు, ఆరుట్లలక్ష్మి కనకయ్య, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ రాగల దుర్గయ్య తదితరులు ఉన్నారు.

ఈనెల 6న జాబ్ మేళా

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా ఉపాధిశాఖ ఆధ్వర్యంలో రేపు(శుక్రవారం) జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వందన బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మి మార్కెటింగ్ కంపెనీలో (4)ఉద్యోగాల భర్తీకి రేపు ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులో గల పాత వెలుగు ఆఫీస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 25 ఏండ్లలోపు ఉండాలని, ఎస్ఎస్సి, ఇంటర్, ఐటిఐ విద్యార్హతలు గల అభ్యర్థులు అర్హులన్నారు. జీతం రూ.10,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 6న నిర్ణీత సమయంలోగా తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డ్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో నేరుగా జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08455-271010ను సంప్రదించాలన్నారు.

కుటుంబ కలహాలతో హెూంగార్డు ఆత్మహత్య

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



కుటుంబ కలహాలతో ఓ హెూంగార్డు ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి దేవసాని మల్లారెడ్డి(53) హుస్నాబాద్‌లో హెూంగార్డుగా విధులు నిర్వర్తిస్తు న్నాడు. మంగళవారం భార్యతో గొడవ జరగడంతో అతడు మనస్తాపానికి గురయ్యాడు. రాత్రి సమయంలో అందరూ నిద్రలో ఉండ గా.. ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య ఉదయం నిద్రలేచే సరికి మల్లారెడ్డి విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. దీంతో వెంటనే ఆమె పోలీసులకు సమాచారం అందించింది. ఘటన స్థలానికి వెళ్లిన ఏఎస్ఐ సురేందర్ రెడ్డి పంచనామా చేసి పోస్టుమార్టం కోసం మతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.

పెద్దల సమక్షంలో కులాంతర వివాహం

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల పరిధిలోని నాగులపల్లి గ్రామానికి చెందిన కురుమ విష్ణు, అదే గ్రామంలోని దళిత ఎస్సి మాదిగ కులానికి చెందిన కవిత గత మూడేం డ్లుగా ప్రేమించుకుంటున్నారు. వారి కులాలు వేర్వేరు కావడంతో వరుడి కుటుంబ సభ్యులు పెండ్లికి ఒప్పుకోలేదు. దీంతో అమ్మాయి గ్రామ పెద్దలను, పోలీసులను ఆశ్రయించారు. దీంతో వారు మార్కెట్ యార్డ్ ఆవరణంలో ఆ ప్రేమ జంటకు పెండ్లి జరిపించారు.

రూ.4లక్షలతో హైమస్ లైట్ల ఏర్పాటు

నవతెలంగాణ-న్యాల్‌కల్



ముంగి ఎంపీటీసీ విజయలక్ష్మి నరసింహారెడ్డి తన సొంత నిధులు రూ.4 లక్షలు వెచ్చించి మిర్జాపూర్ (ఎన్), రుక్మాపూర్, గ్రామ పంచాయతీలకు హైమాస్ లైట్లను ఏర్పాటు చేసి.. బుధవారం టెంకాయలు కొట్టి ప్రారంభి ంచారు. కాగా హైమస్ లైట్లు ఇవ్వడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. వారి వెంట సర్పంచులు మల్ రెడ్డి, స్వరూప నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాలకు చేరుకున్న బతుకమ్మ చీరలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

బతుకమ్మ పండుగ కానుకగా ప్రభుత్వం అందజేస్తున్న చీరలు మండలంలోని గ్రామాలకు చేరుకున్నా యని ఎంపీడీఓ తెలిపారు. ఈయేడు మండలానికి 12,470 చీరలు వచ్చా యని.. నేటినుంచి బతుకమ్మ చీరల పంపిణీ ఉండొచ్చన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

నవతెలంగాణ-అమీన్‌పూర్



అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి, కమిషనర్ జ్యోతి రెడ్డి చేతుల మీదుగా మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కల్పన ఉపేందర్ రెడ్డి, కొల్లూరి చంద్రకళ గోపాల్, బిజిలి రాజు నవనీత, జగదీష్, కవితా శ్రీనివాస్ రెడ్డి, బోయిని బాలమణి బాలరాజ్, కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, యూనుస్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు శేఖర్, కొల్లూరి యాదగిరి, చౌటకూరి మహిపాల్ రెడ్డి, ఆంజనేయులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ గేమ్స్‌కు జిన్నారం గురుకుల విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారానికి చెందిన గిరిజన గురుకుల బాలుర కళాశాల పాఠశాలకు సంబంధించిన ఇద్దరు విద్యార్థులు ఉమ్మడి మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ విభాగానికి ఎంపికైనట్టు బుధవారం ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. అండర్ 17 క్రీడల విభాగం కింద సిద్దిపేటలో జరిగిన సెలక్షన్లో గురుకుల కళాశాల విద్యార్థులు జస్వంత్, ప్రతాప్‌లు ఎంపిక కావడం పట్ల జిన్నారం గిరిజన గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి, కోచ్ మహేష్ బృందం వారిని అభినందించారు.

అన్నాసాగర్ చెరువులో గుర్తుతెలియని శవం లభ్యం

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని అన్నాసాగర్ చెరువు తూము కింద గుర్తు తెలియని శవం లభ్యమైంది. జోగి పేట ఎస్సై గైపప్పా తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం గుర్తుతె లియని శవం నీటిలో తేలియాడుతూ కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని.. మృతదేహాన్ని పోలీసులు బయటికి తీశారు. మృతుడి వయస్సు సుమారుగా 30 ఏండ్లు ఉంటుందని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాధిత కుటుంబాలను వైస్ ఎంపీపీ పరామర్శ

నవతెలంగాణ-తొగుట



మండలంలోని కాన్గల్ గ్రామంలో ఇటీవల మరణించిన సంఘపల్లి శంకం య్య, పిట్ల ఆగయ్యల కుటుంబ సభ్యుల ను వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి బుధవారం పరా మర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇరు కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ దోమల కొమురయ్య, కాన్గల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మూడికే కనకయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ చింతమడక శ్రీధర్, బీఆర్ఎస్ నాయ కులు బొమ్మడ కర్ణాకర్, దార స్వామి, దార మల్లయ్య, లక్ష్మారెడ్డి, సంతోష్‌రెడ్డి, పరశురాములు, బాలరాజు, నరేష్, పరుశరాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కొండపాక

కొండపాక గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి పదివేల రూపాయలను, తెలంగాణ జాగృతి కార్యదర్శి అనంతుల ప్రశాంత్ రూ.5000, మంచాల శ్రీనివాస్ గౌడ్ రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు.

ఎన్నికల సందడి



- విస్తృత పర్యటనలతో బీఆర్ఎస్ అభ్యర్థులు బిజీ..
- పథకాల పంపిణీ, అభివృద్ధి పనుల ప్రారంభాలు
- ఖరారు కాని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు
- అందోల్, జహీరాబాద్ అభ్యర్థుల్ని ప్రకటించిన బీఎస్పీ
- టికెట్లు రాని రెబల్స్ పోటీకి ప్రిపరేషన్
- ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయప్రతినిధి

నోటిఫికేషన్ రానుండడంతో ఎక్కడ చూసినా ఎన్నికల సందడే కనిపిస్తుంది. రాజకీయ పార్టీలతో పాటు అధికార యంత్రాంగం సైతం ఎన్నికల బిజీలో ఉంది. అధికారులు ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తుండగా రాజకీయ పార్టీలు ప్రజల్లో మమేకమవుతున్నారు. బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లో బిజీ అయ్యారు. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు ప్రభుత్వ పథకాల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపాల్లో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్, బీజేపీ ఇప్పటి వరకు అభ్యర్థుల్ని ప్రకటించలేదు. ఆ పార్టీలో కొందరు టికట్ కన్‌ఫాం అనుకున్న నాయకులు తమ ప్రచారాన్ని మొదలు పెట్టారు. బీఎస్పీ సైతం అందోల్, జహీరాబాద్ అభ్యర్థుల్ని ప్రకటించింది. వామపక్షాలు, ఎంఐఎంతో పాటు రెబల్స్ సైతం పోటీకోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

నోటిఫికేషన్ జారీ కానుండడంతో ఎన్నికల నిర్వహణ కోసం ఉమ్మడి మెదక్ జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. మూడు జిల్లాల కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పోలింగ్ బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాల్ని సిద్ధం చేశారు. అదనపు ఓట్ల నమోదు కొనసాగుతున్నా నోటిఫికేషన్ రాగానే వాటిని అదనపు జాబితాలో చేర్చనున్నారు. మూడు జిల్లాలోనూ పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. పోలింగ్ బూత్‌ల వారిగా విధులు నిర్వహించేందుకు అవస రమైన సిబ్బందిని గుర్తించారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలుగా పనిచే సిన అంగన్వాడీల ద్వారా ఓటర్ల జాబితాలు, చేర్పులు, మార్పుల ప్రక్రీయను పూర్తి చేశారు.జహీరాబాద్, నారాయ ణఖేడ్, పటాన్‌చెరు, సంగారెడ్డి, అందోల్, నర్సాపూర్, మెదక్, సిద్ది పేట, దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ నియోజ కవర్గాల్లో ఎన్ని కల రిటర్నింగ్ అధికారులుగా ఉన్న ఆర్డీఓలు రోజువారిగా ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి సమీక్షలు చేస్తున్నారు. మరో పక్క పోలీస్ శాఖ కూడా ఎన్నికల నిర్వహణలో కీలకమైనందున పోలింగ్ స్టేషన్లు, ఈవీఎంలను భద్ర పరిచే కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో బందోబస్తు కోసం అవసరమైన సిబ్బంది అధికారుల్ని గుర్తించింది. ఎన్నికల ప్రచార ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఎన్నికల సంఘం కూడా ప్రత్యేక యాప్‌లు, విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతోంది.

విస్తృత ప్రచారం బీఆర్ఎస్ అభ్యర్థులు

బీఆర్ఎస్ అభ్యర్థులు రోజువారిగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తు ప్రచారం చేస్తున్నారు.కుల సంఘాలు, గ్రామాలు, వార్డుల వారిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. చింత ప్రభాకర్, భూపాల్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్యం, చంటి క్రాంతికిరణ్, హరీశ్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డి, ఒడితల సతీష్‌కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. వీటితో పాటు వివిధ పథకాల కింద లబ్దిదారులను ఎంపిక చేసి వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. మరో పక్క పార్టీ పరంగా నాయకులు, కార్యకర్తల్ని మచ్చిక చేసుకుంటున్నారు. అసమ్మదీయుల్ని కలిసి మద్దతు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది నియోజకవర్గాల్లో అభ్యర్థులు ప్రచారంలో వేగం పెంచారు. 9 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ కూడా అభ్యర్థులుగా ప్రకటించడంతో వాళ్ల ప్రభుత్వ పరంగా కూడా అధికారిక సమావేశాల్లో పాల్గొంటున్నారు.

కాంగ్రెస్‌లో వ్యక్తులుగా ప్రచారం

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల్ని ప్రకటించకపోయినా ఎన్నికలు సమీపిస్తుండడంతో కొందరు వ్యక్తులుగా ప్రచారంలోకి వెళ్లారు. జహీరాబాద్, సంగారెడ్డి, అందోల్ నియోజకవర్గాల్లో డాక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి, మాజీ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. మెదక్ నుంచి టికెట్ వస్తుందన్న భరోసాతో కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి హనుమంతారావు, రోహిత్ రావు లిద్దరూ బుధవారం సర్వ మత ప్రార్థనల పేరిట ఏడుపాయలు, మెదక్ చర్చి, మసీద్‌లో ప్రార్థనలు చేసి మూడు మతాల వాళ్లను ఓట్లేయాల్సిందిగా అభ్యర్థించారు. పటాన్‌చెరులో టికెట్ రాకపోయినా కాట శ్రీనివాస్ గౌడ్ నియోజకవర్గంలో గోడ రాతలు రాయించారు సిద్దిపేట జిల్లా లో కాంగ్రెస్ ఆశావాహులు అడావుడి చేస్తున్నా అభ్యర్థులు ఎవరనేది తేలకపోవడంతో క్యాడర్ అయోమయంగా ఉన్నారు.

దుబ్బాకలో తప్ప ఉలుకు లేని బీజేపీ

ఉమ్మడి మెదక్ జిల్లాలో దుబ్బాక నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునందర్‌రావు తప్ప ఏ నియోజక వర్గంలోనూ ప్రచారం కనిపిస్తలేదు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అభ్యర్థులెవరనేది తేలలేదు. దరఖాస్తులు స్వీకరించిన అధిష్టానం బలమైన నాయకులున్న ప్రాంతాల్లో మోడీ సభలపై దృష్టి పెట్టారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్న దుబ్బాకలో మాత్రం సైలెంట్ ప్రచారం తప్ప సభలు, సమావేశాల ఆరాటం కనిపిస్తలేదు. ఇతర పార్టీల్లోని అసంతృప్తుల కోసం ఎదురు చూస్తున్నందున్నే సొంత పార్టీ వాళ్లను పక్కన పెడుతున్నారనే చర్చ ఉంది.

వామపక్షాలు, బీఎస్పీ ఇతర పార్టీలు సైతం

ఎన్నికల్లో తమ బలం, ప్రజా పునాది ఆధారంగా వామపక్షాలు కూడా పలు చోట్ల పోటీ చేసేందుకు ఏర్పాట్లలో ఉన్నారు. హుస్నాబాద్‌లో సీపీఐ. ఒకటి రెండు స్థానాల్లో సీపీఐ(ఎం) కూడా పోటీ చేసే అవకాశంలేకపోలేదు. బీఎస్పీ ఎస్సి రిజర్వుడ్ జహీరాబాద్‌లో జంగం గోపి, అందోల్‌లో ముప్పారం ప్రకాశంకు టికెట్ ఇచ్చే ఇవ్వనున్నందున వాళ్ల కార్యక్రమాల్లో ఉన్నారు. ఎంఐఎం కూడా ఒకటి రెండు చోట్ల పోటీ చేయవచ్చంటున్నారు. ఇక బీఆర్ఎస్‌లో టికెట్ రాని అసమ్మతి వాదులుగా ఉన్న నీలం మధు పటాన్‌చెరు నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. సంగారెడ్డిలోనూ పట్నం మాణిక్యం కూడా పోటీ ఖాయమంటున్నారు. వీరితో పాటు కాంగ్రెస్, బీజేపీలోనూ టికెట్లు రాని అసమ్మతివాదుల్లో కొందరు కూడా రెబల్‌గా పోటీ చేసే అవకాశముంది.

ఇండ్ల పట్టాలు, బతుకమ్మ చీరలు పంపిణీ





నవతెలంగాణ-నార్సింగి

ఎంపీపీ సబిత రవీందర్ అధ్యక్షతన మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరై.. 58 జీవో ప్రకారం క్రమబద్ధీకరించిన భూములకు పట్టాలను పంపిణీ చేశారు. నార్సింగి 23, నర్సంపల్లి 63, భీమ్రావుపల్లి గ్రామానికి చెందిన ఒకటి చొప్పున లబ్దిదారులకు ఇండ్ల పట్టాలను అందించారు. దుబ్బాక నియోజకవర్గానికి సంబంధించిన ఐదు గ్రామాలైన వల్లూరు, నార్సింగి, నర్సంపల్లి, పెద్ద తండా, భీమ్రావుపల్లిల యువకులకు గ్రామానికి ఒకటి చొప్పున క్రీడా సామాగ్రి కిట్టును అందించారు. అనంతరం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలను నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీటీసీ సత్యనారాయణ, ఎంపీడీవో ఆనంద్ మేరీ, చేగుంట జడ్పిటిసి ముదాం శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

చేగుంట : మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణ బుధవారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, స్పోర్ట్స్ కిట్, బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్దిదారులకు 58 జీవో కింద క్రమబద్ధీకరించిన 13 సర్టిఫికేట్లు, 59 జీవో కింద క్రమబద్ధీకరించిన 11 సర్టిఫికెట్లు, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్దిదారులకు 42 చెక్కులను అందజేశారు. అలాగేయువకులకు స్పోర్ట్స్ కిట్టు, మహిళ లకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి.. అభివృద్ధిలో తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపిన సీఎం కేసీఆర్‌కే మరోమారు అధికారాన్ని కట్టబెట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్డిఓ జయచంద్ర రెడ్డి, ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జెడ్పి టిసి శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మంచి కట్ల శ్రీని వాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్, ఎంపీ డీవో ఆనందమేరి, తహసిల్దార్ గియా సున్నిస్సా బేగం తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

నవతెలంగాణ హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస తండ్రి ఇటీవల మృతి చెందాడు. కాగా బుధవారం జిల్లెల్లగడ్డ గ్రామంలో ఎంపీపీ మానస, సర్పంచ్ స్వరూపలను మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సతీష్ కుమార్ పరామర్శించారు. హనుమకొండ జడ్పీ చైర్ పర్సన్ సుధీర్ బాబు, అక్కన్నపేట ఎంపీపీ లక్ష్మి, భీమదేవరపల్లి ఎంపీపీ అనిత, అక్కన్నపేట జడ్పిటిసి మంగ, భీమదేవరపల్లి జడ్పిటిసి రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, సర్పంచ్లు ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్



పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయంలోనిసమావేశ మందిరంలో ఎంపీడీఒ, ఎంపిఒ, విద్యుత్ శాఖ ఈఆర్ఓ, ఏఈ అధికారులందరితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల్లో మండలాల వారీగా పెండింగ్లో ఉన్న విద్యుత్ బకాయిలు త్వరగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ, శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం ఇలా అన్ని ప్రభుత్వ కార్యకలాపాల విద్యుత్ బకాయిలు త్వరగా చెల్లింపులు జరిపేలా చూడాలన్నారు. అలాగే ఆస్తి పన్ను, ఇంటి పన్ను వసూళ్ల పైన దృష్టి పెట్టాలన్నారు. చాలా కాలం నుండి ఎలాంటి వాడకం లేని విద్యుత్ కనెక్షన్లు.. నామమాత్రపు బిల్లులు పెరుకుపోతున్నాయని ఎంపీఓలు తెలుపగా.. అవసరం లేని కనెక్షన్లను డిలిట్ చేయాలని సూచించారు. విద్యుత్ బకాయిలు ఎక్కువగా పెండింగ్లో ఉన్న మండలాల్లో డిపిఓ అధికారులు సమావేశం నిర్వహించి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో డిపిఓ దేవకిదేవి, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డేటా ఇంజనీరింగ్‌పై గీతంలో అంతర్జాతీయ సదస్సు

ఈనెల 15 వరకు పేర్ల నమోదు

నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరో అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు సమాయత్తమవుతోంది. 'డేటా ఇంజనీరింగ్ అండ్ మెషిన్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై నవంబర్ 22 నుంచి 24వ తేదీ వరకు ఈ సదస్సు నిర్వహించనున్నట్టు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. డేటా సైన్స్, డేటా ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సుస్థిరత విజ్ఞాన ఆధారిత నిపుణుల వ్యవస్థలపై ఆలోచనలు, కొత్త పరిశోధనల్లోని అంతర్గత అంశాలను పంచుకోవడానికి విశ్వవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, విద్యావేత్తలకు ఒక అంతర్జాతీయ వేదికను అందించడం ఈ సదస్సు లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి ప్రముఖ వక్తలు ఈ సదస్సులో పాల్గొంటున్నారని, నార్త్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అసెతంబిబీ లాస్ వేగాస్లోని నెవడా వర్సిటీ ఆచార్యులు ప్రొఫెసర్ హెన్రీ సెల్వరాజ్, ప్రొఫెసర్ లక్ష్మీ గేవాలిలుబీ చైనా, చెంగ్డులోని ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ వర్సిటీ ప్రొఫెసర్ ఆసిఫ్ ఖాన్‌బీ మలేసియాలోని నాటింగ్ హామ్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ టి.నందకుమార్ తో పాటు న్యూయార్క్ లోని ఐబీఎం మేనేజర్ గణేశన్ నారాయణస్వామి తదితరులు తమ అనుభవాలను పంచుకుంటారని ఆ ప్రకటనలో వివరించారు. సైద్ధాంతిక, ఆచరణాత్మక, ప్రయోగాత్మక డొ మైన్లతో సహా అన్ని ఇతర రంగాల నుంచి పరిశోధన పత్రాలను ఈ సదస్సులో సమర్పించవచ్చుని, ఎంపిక చేసిన పత్రాలను స్ప్రింగర్ ప్రొసీడింగ్స్ పుస్తకంగా ప్రచురిస్తామన్నారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు ఈనెల 15వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసు కోవాలని స్పష్టీకరించారు. పేర్ల నమోదు, ఇతర వివరాల కోసం +91 9620160306ని సంప్రదించాలని లేదా Icdemi2023@gitam.inకు మెయిల్ చేయాలన్నారు.

సమతా సైనిక్‌దళ్ ఖేడ్ డివిజన్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్



సమతా సైనిక్‌దళ్ నారాయణఖేడ్ డివిజన్ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు కర్ణం రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమతా సైనిక్ దళ్‌ను స్వయాన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించారన్నారు. తాగునీటి కోసం, విద్య కోసం, రాజకీయ సమానత్వం కోసం, ప్రభుత్వ భారతీయ నిర్మాణం కోసం ఈ సంస్థ ఏర్పడిందన్నారు. సాధించిన విజయాలు, ప్రస్తుతం నిర్వహించాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్తులో తీసుకోబోయే నిర్ణయాలపై వివరించారు. కాగా నారాయణఖేడ్ డివిజన్ కమిటీ అధ్యక్షులుగా టీ. రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గంగ్వార్ సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షులుగా బి నాగేష్, అనుముల తుకారాం, సహాయ కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారి రాములు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా మోహన్, నర్సింలు, కంటెప్ప ప్రధాన సలహాదారులుగా జ్యోతి లింగం, రాజకుమార్, అప్పారావులను ఎన్నుకొని నియమాక పత్రాలను అందజేశారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- యేటా కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ
- రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన అభివృద్ధిశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సతీష్ కుమార్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, అన్ని సంక్షేమ పథకాలను మహిళల పేరు మీదనే ఇవ్వడమే అందుకు నిదర్శనమని తెలంగాణ రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో ప్రభుత్వం తరపున అందిస్తున్న బతుకమ్మ చీరలను ఎమ్మెల్యే సతీష్ కుమార్‌తో కలిసి మంత్రి సత్యవతి రాథోడ్ పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ రెసిడెన్షియల్ గిరిజన పాఠశాల మరియు జూనియర్ కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, కేసిఆర్ పాలన స్వర్ణ యుగంలాంటిదన్నారు. తెలంగాణలోని ప్రతి ఆడబిడ్డకు పుట్టింటి సారే లాగా బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. రూ.500 కోట్ల బడ్జెట్‌తో 90 లక్షల చీరలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో మహిళల పాత్ర కీలకమని, అందుకే తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, మార్కెట్ చైర్మన్ రజిని తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఐలేని అనిత, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డ్ మాకొద్దు సారు..

- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం
- జిల్లా డీఎఫ్ఓకు వినతి పత్రం అందజేత
- విద్యుత్, తాగునీటి సమస్యలతో ప్రజలు సతమతం
- ఆయా శాఖల అధికారులపై ఎంపీపీ ఆగ్రహం

నవతెలంగాణ-గుమ్మడిదల



'ప్రకృతికి హానికరమైన డంప్‌యార్డ్ మాకొద్దు సారు' అంటూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అన్ని పార్టీల నాయకులు ఏకాభిప్రాయంతో తీర్మానం చేసి.. జిల్లా డీఎఫ్ఓకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఎంపీపీ సద్ది ప్రవీణ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయా శాఖల అధికారులపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. పలువురు ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతూ.. దళిత బంధు, బీసీ బందు, మైనార్టీబందు, గృహలక్ష్మి పథకాలు కేవలం అధికార పార్టీ కార్యకర్తలకి కేటాయిస్తున్నారని.. కనీసం పంచాయతీలో గ్రామసభలు నిర్వహించకుండానే లబ్దిదారుల ఎంపిక నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలో గల ప్యారానగర్ పరిసరాల ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న డంప్‌యార్డ్‌తో స్థానిక ప్రజలకు, పంట పొలాలకు తీవ్ర నష్టం జరుగు తుందన్నారు. ఈ మేరకు మండల ప్రజలు, పజాప్రతి నిధులు ఏకాభిప్రాయంతో డంప్‌యార్డ్ ఏర్పాటు చేయొద్ద ంటూ జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్ రావుకు వినతి పత్రం అందజేశారన్నారు. ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. డంప్‌యార్డ్ ఏర్పాటు చేయకుండా సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకా రంతో ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే గొర్లు, మేకల పెంప కం కోసం అటవీ ప్రాంతంలో అనుమతులు ఇవ్వాలని కోరారు. జిల్లా అటవీ శాఖ అధికారి స్పందిస్తూ.. రాష్ట్ర జీవాల మేత కొరకు కొంత ప్రాంతాన్ని ప్రజా ప్రతినిధులు ఎంపిక చేసి.. తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులకు నివేదిం చి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నక్క మంజుల వెంకటేష్ గౌడ్, తహసీల్దార్ గంగాభవాని, ఎంపీ టీసీ ప్రభాకర్ రెడ్డి, చిదు పద్మ బుద్దుల పార్వతమ్మ, సురభి నాగేందర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, మద్ది మల్లమ్మ బ్యాగ్రి లక్ష్మి సర్పంచులు శంకర్, ఆంజనేయులు, గడ్డం హనుమంత్ రెడ్డి, కంచర్ల శ్రీనివాస్, చిమ్ముల నరసింహారెడ్డి, దీప,ఆలేటి నవీన, అభిశెట్టి రాజశేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-జిన్నారం

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలం శివనగర్ గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన యూత్ బిల్డింగ్, రూ.15 లక్షలతో నిర్మించిన రజక సంఘం భవనాలను సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ కుంచాల ప్రభాకర్ స్థానిక ప్రజాప్రతిని ధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటాన్చెరువు నియోజకవర్గం వ్యాప్తంగా పల్లె, పట్టణం అని తేడా లేకుండా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేఖా కృష్ణ, ఎంపీటీసీ బత్తుల సంతోషి మహేష్, వివిధ గ్రామాల సర్పంచులు ఆంజనేయులు, శెట్టి శివరాజ్, ఖదీర్, జనార్ధన్, మాజీ సర్పంచ్ పూజారి రాజు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో నూతన గ్రంథాలయ ఆవిష్కరణ



నవతెలంగాణ-కొండాపూర్

టీఎస్‌హెచ్‌డీసీ చైర్మెన్ చింతా ప్రభాకర్, గ్రంథాలయాల జిల్లా చైర్మెన్ నరహరిరెడ్డిలు బుధవారం మండల కేంద్రంలో నూతన గ్రంథాలయాన్ని భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల సేవలను విస్తరించడమే ధ్యేయంగా సర్కారు కృషి చేస్తున్నదన్నారు. విజ్ఞానాన్ని పంచే పుస్తకాలు విద్యార్థులు చదువుకునేందుకు, పోటీ పరీక్షలలో విజేతలుగా నిలిపేందుకు దోహదపడతాయన్నారు. వారి భవిష్యత్తుకు గ్రంథాలయాలు అన్ని విధాలుగా ఉపయోగపడాలని రాష్ట్ర ప్రభుత్వం రూ.35 లక్షలు బడ్జెట్ కేటాయించిందన్నారు. అనంతరం మండలంలోని రైతు వేదిక ఆవరణలో చీరల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఏం.విటల్, జెడ్పీటీసీ పద్మావతి పాండురంగం, ఎంపీపీ మనోజ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామచంద్రయ్య, తాసిల్దార్ అనిత, ఎంపీడీవో మధులత, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, పల్లె రాందాస్, సర్పంచులు రుక్మద్దీన్, శివలీల జగదీశ్వర్, ప్రకాశం, నర్సింలు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బక్కి వెంకటయ్యను సన్మానించిన కార్పొరేషన్ చైర్మెన్‌లు

నవతెలంగాణ-జహీరాబాద్

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన బక్కి వెంకటయ్యను టీఎస్ఐడీసీ చైర్మెన్ మహమ్మద్ రఫీర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ వై.నరోతం బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



రైతులకు రుణమాఫీ చెక్కులు అందజేత

నవతెలంగాణ-సంగారెడ్డి

రైతులకు రుణమాఫీ చెక్కులను చింతా ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని కోరుకునే వ్యక్తి సీఎం కేసీఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ అధికారులు, కృష్ణ రెడ్డి, మోహన్ రెడ్డి, వ్యవసాయ అధికారులు ప్రసాద్ ,అనిత, చైతన్య, ప్రదీప్, గణేష్, వ్యవసాయ విస్తిరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.



పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-వట్‌పల్లి

మండలంలో ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ బుధవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, నూతన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం సీఎం కసీఆర్ సహకా రంతోనే సాధ్యమవుతుందన్నారు. అంత కుముందు ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ బతుకమ్మ చీరలను, సీఎంర్ రిలీఫ్ ఫండ్ చెక్కులను, గృహలక్ష్మి మంజూరు పత్రాలను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలకు ఫ్యాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పత్రి కృష్ణవేణి నరసింహులు, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-జహీరాబాద్

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని టౌన్ మిషన్ కోఆర్డినేటర్ బసవంత్ రెడ్డి అన్నారు. జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఓటు హక్కు విని యోగించుకోవడంపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని, ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ బాధ్యతగా ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనై జర్లు, ఎస్‌హెచ్‌జి మహిళలు స్వర్ణకుమారి, శారద, కళావతి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-వట్‌పల్లి

మండలంలో బుధవారం ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పర్యటన సందర్భంగా.. కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ముందస్తు అరెస్టులు చేయించి ఎమ్మెల్యే గ్రామాల్లో పర్యటించడం ఎంతవరకు సమంజసమ న్నారు. అరెస్టు అయిన వారిలో వట్పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రవీణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.



ఫోటో ఎక్స్‌పోను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-సదాశివపేట

ఈనెల 6, 7, 8 తేదీల్లో హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్లో పెద్ద ఎత్తున నిర్వహించే ఫోటో ఎక్స్‌పోలో పట్టణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సదాశివపేట ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుల విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పిట్లలకేరి విజయ్ ఫోటో స్టూడియోలో ఫోటో ఎక్స్‌పో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు బిట్ల రాజు, పట్టణ అధ్యక్షుడు నాగుల విజయ్ కుమార్‌లు మాట్లాడుతూ.. ఈ ఫోటో ఎక్స్‌పోను ప్రతీ ఒక్క ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ మిత్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బిట్ల రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి జయచింతన్ స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు గొల్లగూడెం శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షుడు మన్నె శ్రీనివాస్, సభ్యులు మహేశ్వర్, సంగమేష్, నాగుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులు సంతోషంగా గడపాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

వయోవృద్ధులు తమకు నచ్చిన విధంగా సంతోషంగా గడపాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జె.హనుమంతరావు అన్నారు. జీవితాన్ని బాగా ఆకలింపు చేసుకుని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మారాలని సూచించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమం, వయోవృద్ధుల శాఖ ఆధ్వరంలో బుధవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హనుమంతరావు హాజరై మాట్లాడారు. సమాజానికి, ప్రపంచానికి దిశా మార్గనిర్దేశం చేసేది వయోవృద్ధులేనని, వీరిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధులకు అంతర్జాతీయ శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధాప్యంలో వయోవృద్ధులు సంతోషంగా తమకు నచ్చిన విధంగా బ్రతికేలా మార్గాన్ని నిర్దేశించుకోవాలన్నారు. రానున్న తరాన్ని కాపాడాల్సిన బాధ్యత వయోవృద్ధుల దేనన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం-2007 కల్పిస్తున్న రక్షణ, హక్కులపై వయోవృద్ధులకు ఆయన అవగా హన కల్పించారు. డీఆర్‌ఓ నగేష్ మాట్లాడుతూ.. వయోవృ ద్ధులు ఎంతో అనుభవం గల వారిని, నేటి యువతకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. వయోవృద్ధులది అత్యంత శక్తివంతమైన సముదాయమని, తమ అనుభవాలతో భవిష్యత్ నిర్మాణానికి పాటుపడాలని కోరారు. రానున్న యువతకు వారి నైపుణ్యతలు, అనుభవాలు అందించాలన్నారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అన్ని విధాల సహకరిస్తుందన్నారు. వృద్ధాప్య సంరక్షణ చట్టంపై వివరించారు. జిల్లాలో నాలుగు సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్స్ ఉన్నాయని, ఎవరికైనా ఇబ్బంది కలిగితే నిర్భయంగా తెలియజేయాలన్నారు. వృద్ధులను నిర్లక్ష్యం చేసినా, మానసిక, శారీరక,ఆర్థిక వేధింపులకు గురిచేసిన, పోషణ, సంరక్షణ బాధ్యతలు విస్మరించినా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ సహాయార్థం తెలంగాణ ప్రభుత్వం హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 14567ను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా మహిళ శిశు వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి మాట్లాడుతూ.. జిల్లాలో నిరాధరణకు గురైన తొమ్మిది మంది వయోవృద్ధులకు వృద్ధుల ఆశ్రమంలో ఆశ్రయం కల్పించడం జరిగిందని, వృద్ధులను వేధించడం మరియు పోషణకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా 34 మంది వృద్ధులు ఆశ్రయించగా, పరిష్కరం కోసం సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ ట్రిబ్యునల్ కు (ఆర్డీఓ) పంపినట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రి దేవి మాట్లాడుతూ.. ఎన్‌సీడీ ప్రోగ్రాంలో భాగంగా వయోవృద్ధులకు ఉచిత వైద్యం మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎల్డర్ క్లినిక్ ద్వారా వైద్యం అందించబడుతుందని, ఇట్టి అవకాశాన్నివృద్ధులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి వయోవృద్ధులకు ఈవీఎంపై ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సామాజిక సేవలు అందిస్తున్న పదిమంది వయోవృద్ధులకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ హనుమంతరావు, డీఆర్‌ఓ చేతుల మీదుగా శాలువా, మెమెంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి సంధ్యారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ గాయత్రి దేవి, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిడి అఖిలేష్ రెడ్డి, సీడీపీఓలు, వయోవృద్ధుల రాష్ట్ర జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.



పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

నవతెలంగాణ-న్యాల్‌కల్

పేదల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవు తుందని ఆ పార్టీ జహీరాబాద్ చీఫ్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏ.చంద్రశేఖర్ అన్నారు. 'వస్తున్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా మూడో రోజైన బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించార. ఈ సందర్భంగా ఆయనకు నాయకులు శాలువా, పూలమాలతో సన్మానించి.. టపాకాయలు కాలుస్తూ భారీ ఊరేగింపుతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తీసుకు వస్తున్న ఆరు గ్యారెంటీలతో ప్రతీ ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. కాబట్టి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే ప్రజలు ఆశీ ర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బి.శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు భాస్కర్‌రెడ్డి, మెటల్‌కుంట తిరుపతి రెడ్డి, సిద్ధిలింగయ్య స్వామి, రేజింతల్ ఎంపిటిసి నల్లవల్లి మల్లిక శ్రీనివాస్ రెడ్డి, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, సిరాజోద్దీన్, తిరుపతిరెడ్డి, బలవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా రహదారుల విస్తరణ

నవతెలంగాణ-పటాన్‌చెరు



రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పటాన్‌చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులు విస్తరిస్తున్నామని, దీని మూలంగా అభివృద్ధి శరవేగంగా కొనసాగుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని నందిగామ, పాశమైలారం, బచ్చు గూడెం, పెద్దకంజర్ల గ్రామాల్లో రూ.28 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రధానంగా నందిగామలో రూ.3కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన నూతన ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓఆర్ఆర్ జంక్షన్ నుంచి పెద్ద కంజర్ల మీదుగా శివానగర్ వరకు రూ.22 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో చేపట్టనున్న రహదారి విస్తరణ పనులకు పెద్దకంజర్ల చౌరస్తాలో శంకుస్థాపన చేశారు. అనంతరం నందిగామ పాశమైలారం, బచ్చుగూడెం గ్రామాలలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రహదారుల అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఓఆర్ఆర్ జంక్షన్ నుండి ఇంద్రేశం, పెద్ద కంజర్ల మీదుగా శివనగర్ వరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనులు పూర్తయితే ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దీంతోపాటు పెద్ద కంజర్ల నుంచి బేగంపేట్ వరకు 11 కోట్ల రూపాయలు కేటాయించి అతి త్వరలో రహదారి విస్తరణ పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ సుష్మ శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఎంపీడీవో బన్సీలాల్, సిఐ లాలు నాయక్, ఆయా గ్రామాల సర్పంచులు ఉమావతి గోపాల్, మోటే కృష్ణ యాదవ్, సుమతి రామచందర్, నరసింహ, రాజ్‌కుమార్, నారాయణరెడ్డి, ఎంపీటీసీలు నాగజ్యోతి లక్ష్మణ్, మమత బిక్షపతి, వెంకట్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, నాయకులు వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, బిక్షపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన చింతా ప్రభాకర్

నవతెలంగాణ-సదాశివపేట



సదాశివపేట పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్ బుధవా రం శంకుస్థాపన చేశారు. 16వ వార్డులో పద్మశాలి కమ్యూ నిటీ హాల్ భవన నిర్మాణాన్ని రూ.22 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ పక్కన రూ.1.50లక్షలతో ఇండోర్ స్టేడియం, రూ.1.60 లక్షలతో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేశారు. ఆరో వార్డులో దోబీ ఘాట్‌కు సంబంధించి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. రూ.2కోట్లతో ఆధునిక పరికరాలు, అత్యాధునిక సౌకర్యాలతో ఈ దోబీ ఘాట్‌ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. అనంతరం చింతా ప్రభాకర్ మాటాడుతూ.. దోబీ ఘాట్‌ను ఒక నెలలో పూర్తి చేస్తామని, దీనికి సంబంధించిన మిషనరీ పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తి నాణ్యతతో ఈ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం,గుండు రవి, కో ఆప్షన్ సభ్యులు కోడూరు అంజయ్య పలువురు బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ రాష్ట్రంలో అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు డిమాండ్ చేశారు. బుధవారం జోగిపేటలో మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తక్షణమే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ ఏరియల్ మొత్తం చెల్లించాలన్నారు. ఆరు నెలలుగా జీతాలు రాక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులు విడుదల చేసి కొత్త మెనూ జారీ చేయాలన్నారు. బడ్జెట్ కేటాయించి.. వేతనాలు చెల్లించా లన్నారు. ప్రభుత్వమే ఐడీ కార్డులు ఇచ్చి వంటషెడ్‌లు ఏర్పాటు చేసి.. కాటన్ దుస్తులు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, సౌకర్యం కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, మధ్యాహ్నం భోజన కార్మికులు సావిత్రి, మరియమ్మ, రత్నమ్మ పుష్పమ్మ, లక్ష్మి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఫీజుతో సంబంధం లేకుండా హాల్ టికెట్లు ఇవ్వాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ఫీజుల పేరుతో హాల్ టికెట్ ఇవ్వకుండా విద్యార్థులను వేధించడం సరికాదని.. విద్యార్థులందరికీ పరీక్ష రాసే విధంగా హాల్ టికెట్ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఒకేషనల్ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఒకేషనల్ కళాశాల యజమాన్యం విద్యార్థులు ఫీజులు చెల్లించినా రశీదులు ఇవ్వకుండా.. మళ్ళీ ఫీజులు కట్టాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. ఒక 10 మంది టీసీలు తీసుకుని వెళ్తే వాళ్ల దగ్గరి నుంచి రూ.20 వేలు వసూలు చేశారని ఆరోపించారు. తిరిగి వారు డబ్బులు అడుగుతే 'నువ్వు ఎవరికి అయినా చెప్పుకో తిరిగి ఒక్క రూపాయి కూడా ఇవ్వను' అని విద్యార్థులను భయబ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. కాబట్టి వెంటనే కళాశాల యజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని మీడియా వాయిస్ తీసుకుంటుండగా.. కాలేజ్ పై నుంచి యజమాన్యం రాళ్లతో కొట్టడంతో ఫోన్ పగిలిపోయిందన్నారు. మీడియా పైన కూడా యజమాన్యం దౌర్జన్యం చేసింది అనడానికి ఇదే నిదర్శనమన్నారు. కాబట్టి ఉన్నతాధికారులు స్పందించి.. సదరు యాజమాన్యంపై చర్యలు తీసుకుని, ప్రతీ విద్యార్థి పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ నాయకులు, శ్రీనివాస్, పవన్, కుమార్, స్వప్న, మంజుల, శోభ, స్పందన, స్వరూప, సంపూర్ణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం







నవతెలంగాణ-పటాన్‌చెరు

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు విమర్శించారు. ఆశా వర్కర్ల నిరవధిక సమ్మెలో భాగంగా 10వ రోజైన బుధవారం పట్టణంలోని శ్రామిక భవన్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు పారితోషకం అసలే వద్దని.. ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు నిర్ణయించి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2006లో అప్పటి ప్రభుత్వం ఆశాలను నియమించినప్పటి నుంచి ఈ 18 ఏండ్లలో ఎలాంటి ఉద్యోగ భద్రత లేదన్నారు. వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేడు(గురువారం) జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు గీతా,హైమావతి, వీరమణి, సరిత, లక్ష్మి మాధవి, వనజ, నాగమణి, అరుణ, భాగ్య, అంజమ్మ, పున్యమ్మ, రాణి,గంగా పాల్గొన్నారు.

జహీరాబాద్ : ప్రభుత్వం ఆశా వర్కర్లకు పనికి తగిన వేతనం ఇవ్వకుండా.. పారితోషికాల పేరుతో వారి శ్రమను దోపిడీ చేస్తున్నదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ ఆరోపించారు. ఆశా వర్కర్ల నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూని యన్ నాయకులు శశిరేఖ, శశికళ, అన్నమ్మ, కవిత, లక్ష్మి,శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లి : నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం బిక్షాటన చేస్తూ ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని వారు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు అందిస్తాం



నవతెలంగాణ-అమీన్‌పూర్

మున్సిపల్ పరిధిలోని 17వ వార్డ్ రూప శ్రీ కౌంటీ, నందన్ మెడోస్, శంకర్ గ్రీన్ హెూమ్స్, దుర్గ ప్రావిన్స్ కాలనీలో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందించే కార్యక్రమాన్ని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి ప్రారంభించారు. రోజురోజుకీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ ద్వారా రక్షిత మంచినీరు అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్, కొల్లూరి చంద్రకళ గోపాల్, కల్పన ఉపేందర్ రెడ్డి, బోయిని బాలమణి బాలరాజు,బిజిలి రాజు,నవనీత జగదీష్,కవితా శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, యునుస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల వలే పనిచేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్క కార్యకర్త సైనికుల వలే పని చేయాలని బీజేపీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ రంగారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మండలా ధ్యక్షుల, మండల ఇన్చార్జిల సమావేశంలో రంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్క కార్యకర్త సైనికుల పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలకు గెలుపు దశగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్ కోవూరు సంగమేశ్వర్, శ్రీకాంత్ గౌడ్, ఎడ్ల రమేష్, ఆదోని రవీందర్, మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంత్ రెడ్డి, జగన్నాథ్, మహేందర్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు నర్సారెడ్డి, చంద్రశేఖర్, అసెంబ్లీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- ఆరు గ్యారెంటీలతో క్షేత్రస్థాయిలో పార్టీకి పెరిగిన ఆదరణ
- 80 సీట్లతో అసెంబ్లీలోకి అడుగుపెడతాం
- పార్టీ సీనియర్ నేత, మున్సిపల్ వైస్ చైర్మెన్ అనిల్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

రాబోయేది కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వమేనని ఆ పార్టీ సీనియర్ నేత, మున్సిపల్ వైస్ చైర్మెన్ అంతిరెడ్డిగారి అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీ పథకాలతో క్షేత్రస్థాయిలో పార్టీకి ఆదరణ పెరిగిందన్నారు. 80 సీట్లతో విజయం సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆటలు ఇక సాగవన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి బీజేపీ-బీఆర్ఎస్ మిత్ర పక్షాలను ఇంటికి పంపడమే తమ ధ్యేయమన్నారు. సుస్థిర పాలన అంటే కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఆరు గ్యారెంటీల ద్వారా రాష్ట్ర ప్రజలకు ప్రతిఒక్కరికి లబ్ధి చేకూరుతుందన్నారు. తమ పార్టీ బూత్ స్థాయి నుండి నియోజకవర్గాల వరకు రాష్ట్ర వ్యాప్తంగా చాలా పాటిష్టంగా ఉందని ధీమా వ్యక్తం చేసారు. ఈ దశాబ్ద కాలంగా పార్టీకి అండగా నిలపడ్డ కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకునే బాధ్యత అధిష్టానం మరియు తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించిన కౌన్సిలర్

నవతెలంగాణ-జోగిపేట



అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో తోళ్ల బస్తి నుంచి ధృవ హాస్పిటల్ వరకు ప్రారంభమైన నూతన సీసీరోడ్డు పనులను కౌన్సిలర్ శంకరంపేట సురేందర్‌గౌడ్ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం బస్తీలోని ఇంటింటికి తిరుగుతూ మురుగు నీటి డ్రయినేజీ పైప్‌లైన్లపై ఆరా తీశారు. అవసరమైన వారికి నూతన డ్రయినేజీ పైప్ లైన్ నిర్మాణ పనులను హుటాహుటినా సొంత డబ్బులతో చేపట్టారు. వార్డు, బస్తి ప్రజల అవసరాలను తెలుసుకొని సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీనిచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయన్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగ్య నగర్ కాలనీ అధ్యక్షులు రాజశేఖర్, ఉపాధ్యక్షులు రమేష్, కోశాధికారి అనిల్ కుమార్, ప్రచార కార్యదర్శి ఆనంద్, గౌరవాధ్యక్షులు బైండ్ల రమేష్ లు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాద్ ముట్టడి విజయవంతం

నవతెలంగాణ-వట్‌పల్లి



'ఛలో హైదరాబాద్'కు వెళ్లకుండా అంగన్వాడీ ఉద్యో గులపై ఎన్ని కుతంత్రాలు చేసినా.. నిర్బంధాన్ని చేధించి హైదరాబాద్ ముట్టడిని విజయవంతం చేశారు. ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున అర్ధరాత్రి హైదరాబాదుకు బయలుదేరి తరలి వెళ్లారు. ఖాదీరాబాద్ సెక్టర్ నుంచి జయ మ్మతో పాటు మరికొందరు హైదరాబాద్ కు తరలి వెళ్లారు.

నూతన గ్రామ పంచాయతీకి భూమి పూజ



నవతెలంగాణ-కౌడిపల్లి

నూతన గ్రామ పంచాయతీకి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు చిలుముల వెంకటేశ్వర రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. కౌడిపల్లి మండల కేంద్రంలో శిథిలావస్థలకు చేరిన గ్రామపంచాయతీ భవనం నర్సాపూర్ ఎమ్మెల్యే చిరుముల మదన్ రెడ్డి 20 లక్షలతో నూతన గ్రామపంచాయతీని మంజూరు చేయడంతో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివాంజనేయులు, ఉప సర్పంచ్ చంద్రం శ్రీనివాస్ గౌడ్, వార్డు మెంబర్లు తిరుమలేష్ బర్ల కృష్ణ, పెంట గౌడ్, సప్న మల్లేష్, కొమరమ్మ, జగన్, ఎస్ఎంసి చైర్మన్ జగన్, పాండు కారోబార్ ఎల్లం, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, అనిల్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అంగన్వాడీల ముందస్తు అరెస్ట్



నవతెలంగాణ-నార్సింగి

గత 27 రోజుల నుంచి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీ టీచర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. బుధవారం సిఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ ముట్టడికి బయలుదేరి వెళుతున్నారని తెలుసుకున్న నార్సింగి పోలీసులు మండల వ్యాప్తంగా ఉన్న 22 అంగన్వాడి సెంటర్లకు సంబంధించిన అంగన్వాడి టీచర్లను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని ఏఎస్ఐ అడికేబర్రె శంకర్ తెలిపారు. అనంతరం అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ తాము జేఏసీ యూనియన్‌లో ఉన్నామని, ఇప్పుడు జరుగుతున్న అంగన్వాడీ సమ్మె సిఐటీయూ యూనియన్ వాళ్ళు చేస్తున్నారని, తమకు ఈ ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి సంబంధం లేదని చెప్పినా తమను అరెస్ట్ చేశారన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో అంగన్వాడీ టీచర్లు సునీత, సౌమ్యా, బాలమని, మహేశ్వరి, పెంటి, రేఖా, రాజ్యలక్ష్మి మల్లవ్వ, ఇందిరా తదితరులు ఉన్నారు.

అంగన్వాడి టీచర్లు అరెస్ట్



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని గ్రామాల అంగన్వాడీ టీచర్లను నిజాంపేట పోలీసులు బుధవారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ మంగా మాట్లాడుతూ గత నెల సెప్టెంబర్ 11 నుంచి అంగన్వాడీ టీచర్లు సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వము పట్టించుకోవడం లేదన్నారు. తమకు రూ.26 వేల జీతం ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఈసీఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేణుక, దుర్గేశ్వరి, రాణి, సునీత, నాగలక్ష్మి, వీణ, మణెమ్మ, యశోద, అరుణ ,పద్మ, లలిత ,మరియ, రాజమణి, జ్యోతి, సుధా, భార్గవి తదితరులు పాల్గొన్నారు

అంగన్వాడి టీచర్లపై కక్ష సాధింపు తగదు

- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి



నవతెలంగాణ-వెల్దుర్తి

అంగన్వాడి టీచర్లపై రాష్ట్ర ప్రభుత్వం కాక్ష సాధింపు చర్యలు మానుకొని చర్చలు జరపాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా చలో హైదరాబాద్ కార్యక్రమం ఉంటుందన్న సమాచారం మేరకు వెల్దుర్తి పోలీసులు అక్రమంగా పోలీస్ స్టేషన్లో బైండ్ ఓవర్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎలాంటి రాస్తారోకోలు ధర్నాలు చేయకుండా సామరస్యపూర్వకంగా ఉన్న అంగన్వాడీలను పోలీస్ స్టేషన్లో పెట్టడం రాష్ట్ర ప్రభుత్వానికి గొడ్డలి పెట్టు లాంటిన్నారు. సమ్మెకు దూరంగా ఉన్నప్పటికీ వెల్దుర్తి చేగుంట పోలీసులు ముందస్తుగా పోలీస్ స్టేషన్ పిలిపించి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బైండ్ ఓవర్ చేయడం ఎంతవరకు సమంజమన్నారు. ఎస్సై మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అంగన్వాడి సిబ్బందిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేయడం జరిగిందన్నారు

బీజేపీ ఆధ్వర్యంలో టీ షర్ట్స్ పంపిణీ



నవతెలంగాణ-వెల్దుర్తి

బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం మండల పరిధిలో రామయపల్లి బండ పోసంపల్లి గ్రామాలతో పాటు మండల కేంద్రంలో కోట కింద ప్రాంత నివాసులకు టీ షర్ట్స్ పంపిణీ చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ నాయకుడు మురళి యాదవ్ ప్రోత్సాహంతో బిజెపి మండల పార్టీ కార్యవర్గం ఆధ్వర్యంలో టీ షర్ట్స్ ను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో రాష్ట్ర ప్రభుత్వంలో సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు రానున్న కాలంలో తెలంగాణ గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు.

పథకాలతోనే గ్రామాల్లో చిచ్చులు

- మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-కౌడిపల్లి

బీర్ఎస్ ప్రభుత్వం కొత్త కొత్త పథకాలతోటి గ్రామాల్లో చిచ్చులు పెడుతుందని మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కౌడిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరున్నర లక్షల కోట్ల అప్పు చేసి గ్రామాలలో బీసీ బందు, దళిత బంధు, మైనార్టీ బందు, పథకాలతో గ్రామాలలో గొడవలు పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చెందారు రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. మైనంపల్లి హనుమంతరావుకు నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆవుల రాజు రెడ్డి, కౌడిపల్లి మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, ధన్సింగ్, శాలువా పూలమాలతో ఎమ్మెల్యే మైనాంపల్లిని సన్మానించారు, అనంతరం ఆశా వర్కర్ల సంఘీభావం తెలిపారు.

మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- మత్స్యశాఖ జిల్లా ఏడి రజిని

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్



మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కోసం ఉచిత చేపల పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మత్స్యశాఖ జిల్లా ఎడి రజిని పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కూచారం గ్రామంలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏడి రజని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పురం మహేశ్వర్ ముదిరాజ్. ముదిరాజ్ మహాసభ నాయకులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు డి నరేష్ ముదిరాజ్ లతోపాటు గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి



నవతెలంగాణ-నార్సింగి

ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కాసులాపుర్ గ్రామ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి మండల కేంద్రానికి చెందిన తమ్మారెడ్డిగారి భూపాల్ రెడ్డి (42) తన స్వంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై రామాయంపేట వెళ్లి అక్టోబర్ 4వ తేదిన అర్ధ రాత్రి దాదాపు 2 గం సమయంలో స్వగ్రామమైన నార్సింగికి తిరిగి వస్తూ మార్గ మధ్యంలో ప్రమాదానికి గురయ్యాడు. కాసులాపూర్ వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలకు గురయ్యాడు. అది గమనించిన స్థానికులు విషయాన్ని భూపాల్‌రెడ్డి భార్య స్వాతికి తెలుపగా, సంబంధీకులతో పాటు సంఘటనా స్థలాన్ని చేరుకుని తీవ్ర గాయాలతో ఉన్న భూపాల్ రెడ్డిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు నార్సింగి ఏఎస్ఐ శంకర్ తెలిపారు.

రంగంపేట సహకార సంఘం అభివృద్ధికి కృషి

- సంఘం చైర్మన్ అరిగె రమేష్ కుమార్



నవతెలంగాణ-కొల్చారం

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసమే సహకార సంఘాలు ఉన్నాయని, ఆ దిశగా ముందుకెళ్తున్నామని రంగంపేట సహకార సంఘం చైర్మన్ అరిగె రమేష్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో చైర్మన్ రమేష్ కుమార్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అందించే ఫలాలు రైతులందరికీ చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంఘం మరింత అభివృద్ధి కోసం రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఈఓ నవీన్, సహకార సంఘం వైస్ చైర్మన్ మోతుకు మల్లేశం, డైరెక్టర్లు జీవయ్య, పాపమ్మ, ప్రవీణ్ రెడ్డి, పెంటయ్య, సాయిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం.. అప్పాజీపల్లి

- అభివృద్ధిలో ఆదర్శం.. అప్పాజీపల్లి
- స్వచ్ఛతకు నిదర్శనంగా రూపుదిద్దుకున్న గ్రామం
- 100 శాతం పూర్తయిన మరుగుదొడ్ల నిర్మాణం
- విశాలమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు
- పత్యేక గుర్తింపు చాటుకుంటున్న సర్పంచ్ ఝాన్సీ లక్ష్మీ

నవతెలంగాణ- కొల్చారం

పక్కాగా రోడ్లు... స్వచ్ఛమైన నీళ్ళు...ధగధగలాడే ఎల్ఇడి లైట్లు...అన్నిటికీ మించి ఇంటింటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు...ఒకప్పుడు అభివృద్ధికి అర్థం తెలియని ఆ గ్రామం... ఇప్పుడు విశేష గుర్తింపును చాటుకుంటుంది. కొల్చారం మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో అప్పాజీపల్లి గ్రామం ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా ఆదర్శం వైపు రూపుదిద్దుకుంటుంది. 2019 జనాభా ప్రకారం గ్రామంలో 1504 జనాభా ఉండగా అందులో పురుషులు 732, స్త్రీలు 772 మంది ఉన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో ఇప్పటి వరకు 290 మరుగుదొడ్లు నిర్మించారు. వీటితోపాటు 270 కమ్యూనిటి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాగా 90 శాతం ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేశారు. అంతేకాకుండా గ్రామంలో హరితహారంలో బాగంగా రోడ్లకు ఇరువైపులా 460 మొక్కలు నాటగా అందులో 260 మొక్కలకు గతంలోనే ట్రీగాడ్స్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా మండలంలోనే ఎక్కడ లేని విందంగా ఇంటిపన్నుల వసూళ్లలో కూడా ముందంజలో ఉంది. అలాగే మురికి కాలువలు, సిసి రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ స్వచ్ఛతకు నిదర్శనంగా నిలుస్తున్నారని చెప్పుకోవచ్చు. దీనంతటి వెనుకా ఉన్న శక్తి.. గ్రామస్తుల సహకారం అలాగే సర్పంచ్ ఛలం ఝాన్సీలక్ష్మీ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి ఫనిందర్‌ల కృషి అనే చెప్పుకోవచ్చు.

అభివృద్ధితోనే గుర్తింపు వస్తుంది

సర్పంచ్ ఛలం ఝాన్సీలక్ష్మీ, అప్పాజీపల్లి



మా గ్రామం పారిశుద్ధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం. పదవులు ఎప్పటికీ శాశ్వతం కాదు. చేసిన మంచిపనులే చిరకాలంగా గుర్తుండిపోతాయి. గ్రామాభివృద్ధికి కృషి చేసిన ప్రజల సహకారం మరువలేనిది.



ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

ఫనిందర్, పంచాయతీ కార్యదర్శి, అప్పాజీపల్లి



గ్రామస్తుల భాగస్వామ్యం తోనే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోగలుగుతున్నాం. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. పారిశుద్ధ్య నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంటి పన్ను వసూళ్ళలో కూడా ముందంజలో ఉన్నాం.

మెదక్‌లో ఆశాల భిక్షాటన

- రూ. 18 వేల వేతనం ఇవ్వాలి
- మంత్రి హరీశ్ రావు పర్యటనను అడ్డుకుంటాం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజ్

నవతెలంగాణ-మెదక్

తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఆశాలు చేస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం మెదక్ పట్టణంలో ఆశా వర్కర్లు బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సేటు జిల్లా కార్యదర్శి బసవరాజు మాట్లాడుతూ.. ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత పది రోజులుగా ఆశా వర్కర్లు శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గౌరవ వేతనంగా పారితోషికాలు కాకుండా, పెరిగిన ధరలకను గుణంగా కనీస వేతనం రూ.18 వేలు నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇకనైనా ఆశాలపై నిర్లక్ష్యం వీడి ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారించాలన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే జిల్లాలో ఎమ్మెల్యేలను, మంత్రులను తిరగనీయమన్నారు. గురువారం మెదక్‌లో మంత్రి హరీష్ రావు పర్యటనను





అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి సావిత్రి, నాయకురాలు స్వప్న, మంజుల, పద్మ, రాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేగోడులో..

ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సర్దార్ అన్నారు. బుధవారం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు బిక్షాటన కార్యక్రమం చేపట్టారు. ఆశ వర్కర్లు ప్రభావతి మరియమ్మ తదితరున్నారు.

ఆశావర్కర్లను పట్టించుకోకపోవడం దురదృష్టకరం

- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి



నవతెలంగాణ-కొల్చారం

గత 18 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న ఆశ వర్కర్లను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్చారంలో ఆశా వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెలో పాల్గొన్న ఆయన ఆశా వర్కర్లకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లు కోరిన న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశావర్కర్లకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అదేవిధంగా ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించి, పనిభారం తగ్గించాలన్నారు. అదేవిధంగా పోతంశెట్టిపల్లి గ్రామంలో ముదిరాజ్‌లు నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారంగా రూ.51వేలు విరాళం అందజేశారు. అనంతరం కొంగోడు గ్రామంలో ఇటీవల అనారోగ్య సమస్యతో బాధ పాడుతూ మృతి చెందిన సోమ్లా, భాస్కర్, పోచయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్, టీపీసీసీ మైనార్టీ సెల్ కార్యదర్శి హకీమ్, కౌడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, నాయకులు గోవర్ధన్, అనిల్, గంగసాని మహేశ్వర్ రెడ్డి, సయ్యద్ అక్రం, బండి మల్లేశం, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఏసు రాజు, రవీందర్ గౌడ్, ఆగం గౌడ్, సమీర్, శ్రీశైలం, బాలరాజ్, అయుబ్ పాల్గొన్నారు.

దళిత బంధు ఎక్కడ

- కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

తూప్రాన్ మున్సిపల్ కేంద్రానికి బీసీ బందు ఇచ్చినప్పటికీ దళిత బంధు ఎక్కడ అని వెంటనే అర్హులైన దళిత వర్గాలకు దళిత బందును కూడా అందజేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన బీసీ దళితవర్గాలకు లబ్ది చేకూరేలా లక్ష రూపాయలు బీసీ బందును, రూ.10 లక్షల దళిత బందును, వికలాంగుల కొరకు స్కూటీలు అందజేయాల్సి ఉండగా బీఆర్ఎస్ పార్టీ పథకాలను రాజకీయ లబ్ది కోసం వాడుకుంటున్నట్టు ఆయన పేర్కొన్నారు. అర్హులకు కాకుండా గ్రామంలో ఆర్థికంగా ఉన్న వ్యక్తులకు బీసీ బందు , స్కూటీలుఇచ్చి రాజకీయమంటే ఏంటో జనాలకు అర్థమయ్యేలా చేస్తున్నాంన్నారు. బిసి బందు, స్కూటీలు తీసుకున్న వ్యక్తులు బిఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేయించాలని లబ్దిదారులకు హుకుం జారీ చేస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నట్టు ఆయన విమర్శించారు. దళిత బంధు కూడా నిజమైన అర్హులకు కాకుండా, బిఆర్ఎస్ కార్యకర్తలకే ఇస్తారేమో అని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు ఈ పథకాలు నిజమైన అర్హులకు చేరాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్టు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

- దుబ్బాకను స్వర్ణ యుగంగా మార్చుకుందాం
- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ- చేగుంట

హెూదాలు పక్కన పెట్టి సమన్వయంతో కార్యకర్తలు అందరూ కష్టపడి పనిచేసి ఈ ఎన్నికల్లో తమను గెలిపించాలని మెదక్ పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండల కేంద్రం బాలాజీ ఫంక్షన్ హాల్లో బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మండల కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కమిటీ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రతి గ్రామ అధ్యక్షుడు, బూత్ కమిటీ అధ్యక్షుడు బాధ్యత వహించి, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రతి కార్యకర్త, ప్రజా ప్రతినిధులు తమ హెూదాలను పక్కనపెట్టి సైనికుల్లా పనిచేయాలన్నారు. అందరి కృషితోనే రెండు పర్యాయాలు మెదక్ ఎంపీగా గెలిపించా నని, అదే కృషి, పట్టుదలతో పనిచేసి దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిపించాలని, కోరారు. దుబ్బాకను స్వర్ణ యుగంలా మార్చుకుందామన్నారు. 60 రోజులు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి ఎన్నికల్లో దుబ్బాక విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు మనోహర్ రావు, ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జడ్పిటిసి శ్రీనివాస్, సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి, సీనియర్ నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి, శ్రీ చక్ర ఫౌండేషన్ నరసింహ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్, నారాయణరెడ్డి, పట్నం తానేష , వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కమిటీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామాగ్రి, బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన ఎంపీపీ



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు చేతుల మీదుగా క్రీడా సామాగ్రిని, బతుకమ్మ చీరలను మండలంలోని గ్రామాల కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము యువతకు క్రీడల పట్ల ప్రోత్సహించడానికి క్రీడా సామాగ్రిని అందజేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలోని యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వము క్రికెట్ కిట్లు, టీ షర్టు, వ్యాయామం డంబుల్స్, వాలీబాల్ , టెన్నిస్, లాంటి సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదే విధముగా తెలంగాణ మహిళలకు బతుకమ్మ చీరలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పరిపాటి సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో జగదీశ్వర్, ఎంపీ ఓ రాజేందర్, నిజాంపేట సర్పంచ్ అనూష లక్ష్మీనరసింలు, ఎంపీటీసీ లహరి కృష్ణారెడ్డి, కార్యదర్శి నరసింహులు, నందిగామ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్, నార్లాపూర్ కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, రాంపూర్ కార్యదర్శి భాగ్యలక్ష్మి, , వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాద్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

- గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 5న నిర్వహించే బహిరంగ సభకు జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా గ్రామపంచాయతీ కార్మిక సంఘం కార్యదర్శి ఆసిఫ్ కోరారు. బుధవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులతో జి పి కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు గతంలో 34 రోజుల సమ్మె చేయగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్య పరిష్కరిస్తారని మోసం చేసిందన్నారు. ఆ మోసాన్ని తిప్పి కొట్టడానికి హైదరాబాదులో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

బోరు మోటారును ప్రారంభించిన ఎంపీపీ సబిత



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని శేరిపల్లి గ్రామం 4వ వార్డులో మండల పరిషత్ నిధులతో బోరు వేయించారు. బుధవారం గ్రామ సర్పంచ్ చెప్యాల మల్లేశం, ఎంపీటీసీ సంతోష స్వామిల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి చిందం సబిత రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీలు మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు మంజూరు చేసి బోరు వేయించి నందుకు వార్డు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యనారాయణ, ఎంపిడిఓ ఆనంద మేరీ, శేరిపల్లి గ్రామ ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి రమేష్, పంచాయితీ కార్యదర్శి నాగరాజు, వార్డు సభ్యులు నాగరాజ్, మ్యా శ్రీను, నర్సింహులు, మాజీ సర్పంచ్ తాళ్ల కృష్ణా గౌడ్, నాయకులు బాలాజీ, భరత్, బొయిని శ్రీను, ర్యాల నర్సింహులు, కొకల మధు తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

- నిరవధిక సమ్మెలో 104 ఉద్యోగులు
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజ్



నవతెలంగాణ-మెదక్

104 ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం మెదక్ కలెక్టర్ కార్యాలయం వద్ద రెండో రోజు కొనసాగిన 104 ఉద్యోగుల నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగులు ఎక్కడ కోరుకుంటే అక్కడ జిల్లాలో అవకాశం కల్పించాలన్నారు. అర్హత ఉన్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. 2021 సంవత్సరం నుండి వాహనాలను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసిన సందర్భంగా ఉద్యోగులను డిసిహెచ్ సిహెచ్సి, ఏరియాల హాస్పిటల్‌లో హబ్ సెంటర్లో రి - డీప్లై చేసిందన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం ఉద్యోగులకు స్లాబ్ పద్ధతిన వేతనాలు చెల్లించడం వలన తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 104 ఉద్యోగులు ప్రభుత్వ ఆధీనంలోనే పని చేస్తున్నప్పటికీ.. కేవలం వేతనాలను మాత్రం ఏజెన్సీల ద్వారా చెల్లించడం వల్ల సకాలంలో ఉద్యోగులకు వేతనాలు అందడం లేదన్నారు. ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి, ప్రభుత్వం నేరుగా ట్రెజరీ ద్వారా ఉద్యోగులకు వేతనాలను జమ చేయాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను కంప్యూటర్ ఆపరేటర్లుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగులు రాజు, భూపతి, అవినాష్ గౌడ్, రమేష్, రవి, సంజయ్, నూరుద్దీన్, మధు, దేవయ్య పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో విద్య వ్యవస్థను మెరుగు పరచాలి

- మెదక్ గర్ల్స్ కాలేజీను మంత్రి హరీష్ రావు పర్యవేక్షణ చేయాలి
- మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యులు జగన్



నవతెలంగాణ-మెదక్ టౌన్

విద్య వ్యవస్థలో మెదక్ జిల్లా వెనుకంజలో ఉందని జిల్లాలో ఇద్దరు ఎంఈవోలు పని చేస్తున్నారని 21 మండలాలకు 16 జూనియర్ కళాశాలలు ఉన్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యులు జగన్ తెలిపారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ రేపు మంత్రి హరీష్ రావు మెదక్ జిల్లా పర్యటన భాగంగా మెదక్ గర్ల్స్ కాలేజ్ సమస్యలు పరిష్కరించేలా చూడాలని పర్యవేక్షించాలని ఆయన అన్నారు. జిల్లాలో ఆర్టీసీ బస్సులు తక్కువ ఉండడం వల్ల కళాశాల విద్యార్థులకు సరైన సమయానికి బస్సులు రావడంలేదని, ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించాలని అన్నారు. జిల్లాలో చాలా హాస్టళ్లు, ప్రభుత్వ స్కూళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటి మరమ్మతుకు బడ్జెట్ కేటాయించాలని కోరారు. హాస్టల్లో పౌష్టికాహారం అందించేలా చూడాలని అలాగే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. మెదక్‌లో పీజీ కళాశాల లేక చాలా మంది విద్యార్థులు దూర ప్రయాణాలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా విద్యా వ్యవస్థలో వెనుకంజలో ఉందని విద్యారంగ సమస్యలు పరిష్కరించేలా చూడాలని ఆయన అన్నారు.

ఉపయోగం లేని చీరలెందుకు



నవతెలంగాణ-కౌడిపల్లి

ఉపయోగం లేని పాలిస్టర్ చీరలు ఎందుకని అధికారుల ముందే మహిళలు అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన కౌడిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బతుకమ్మ చీరల పంపిణీ నిర్వహించారు. ఇలాంటి చీరలు కట్టుకోలేక వేస్ట్‌గానే పడేస్తామని ఈ నాణ్యతలేని పాలిస్టర్ చీరలు ఇచ్చేకన్నా రూ. 250 లు ఇస్తే మంచి చీరలు తెచ్చుకుంటామని అధికారుల ముందే మహిళలు అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలు , క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజు నాయక్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, ఎంపిటిసి శివాంజనేయులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామాగౌడ్, మహిళలు పాల్గొన్నారు

నేడు మెదక్‌కు మంత్రి హరీష్ రావు రాక

నవతెలంగాణ-మెదక్ టౌన్

నేడు మెదక్ పట్టణానికి మంత్రి హరీష్ రావు రానున్నట్లు మున్సిపల్ చైర్మన్ తోడుపునూరి చంద్రపాల్ తెలిపారు. మెదక్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడానికి ఆయన వస్తున్నారని తెలిపారు. టియూఎఫ్ఐడిసి నిధుల నుంచి రూ 20 కోట్లతో పట్టణంలోని సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణ పనులు, ఎస్ డి ఎఫ్ నిధుల నుంచి 50 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ కుల సంఘాల భవనాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

కేసీఆర్ పాలనలో గ్రామాల సమగ్రాభివృద్ధి

- హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో గ్రామాల సమగ్ర అభివృద్ధి జరుగుతుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలో రూ.16 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే సతీష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిరాధారణకు గురైన గ్రామాలు నేడు అభివృద్ధికి చిరునామాలుగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని సాయిలు, మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలానికి కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని వివిధ గ్రామాలకు తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్‌ను మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే యువత కోసం అతిపెద్ద పథకమని పేర్కొన్నారు. 100 కోట్లకు పైగా కేటాయించి యువతకు భారీ కానుకనిచ్చిన సీఎం కేసీఆర్,మంత్రి హరీష్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఒక్కో గ్రామంలోని పంచాయతీ కార్యదర్శికి ఈ కిట్లు అందజేశారు. ఎన్నికల కోసమే ఈ తాయిలాలు అందజేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఓ వేణుగోపాల్, సూపరిండెంట్ ప్రభాకర్ రావు, అయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ బెదురు తిరుపతి, నాయకులు భాస్కర్ రెడ్డి, బాలపోచయ్య తదితరులు పాల్గొన్నారు.

15 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

నవతెలంగాణ-సిద్దిపేట

ఎంతో కాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఎదురుచూ స్తున్న పీఆర్సీ కమిటీని ప్రభుత్వం నియమించడం హర్షణీయం, కానీ మధ్యంతర భృతిని కేవలం 5 శాతం ప్రకటించడం శోచనీయమని, 15 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని టి ఎస్ జి హెచ్ఎంఏ జిల్లా అధ్యక్షులు బెలిదే శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. వేతన జీవులు కనీసం 10 నుంచి 15 శాతం ప్రకటిస్తారని ఆశగా ఎదురుచూస్తున్న సమయములో ముఖ్యమంత్రి 5 శాతం ఐ ఆర్ ప్రకటిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి 15 శాతానికి తగ్గకుండా మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు.

ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు పే స్కేల్ అమలు చేయాలి



నవతెలంగాణ-మర్కుక్

ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు పే స్కేల్ అమలు చేయాలని ఆ సంఘం నాయకుడు బాలనర్సయ్య కోరారు. ఈ మేరకు మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్ కు ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల బృందం బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పని చేసే ఈ పంచాయ తీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించి వేతనం చెల్లించాలన్నారు. మహిళ ఉద్యో గులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. ఉద్యోగ సిబ్బందికి ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగి మృతి చెందితే కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు రాజబోయిన కృష్ణ యాదవ్, సర్పంచుల ఫోరం మర్కుక్ మండలాధ్యక్షులు అప్పాల ప్రవీణ్, నాయకులు మల్లేశం,బాలనర్సయ్య, సంతోష్,తదితరులున్నారు. తదితరులున్నారు.

ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ శ్రీనివాస్‌కు సన్మానం



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట నియోజకవర్గం నుంచి ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా మిట్టపల్లి గ్రామానికి చెందిన సిద్ధరబోయిన శ్రీనివాస్ ఎన్నిక కావడం సంతోషంగా ఉందని సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి అన్నారు. ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ అయిన తర్వాత మొట్టమొదటిసారిగా సమావేశానికి వచ్చిన శ్రీనివాస్‌ను సుడా చైర్మన్ ఆధ్వర్యంలో అర్బన్, రూరల్ ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా సిద్ధిరబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మంత్రి హరీష్ రావు బాధ్యతలు అప్పగించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

భవన నిర్మాణ కార్మిక గర్జన వాల్ పోస్టర్లు ఆవిష్కరణ



నవతెలంగాణ-చేర్యాల

భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న జనగామ జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ గ్రౌండ్‌లో జరిగే భవన నిర్మాణ కార్మికుల గర్జన సభను జయప్రదం చేయాలని రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె అశోక్ కోరారు. కార్మికుల గర్జన సభను జయప్రదం చేయాలని బుధవారం చేర్యాల మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, వలబోజు నర్సింహా చారి, గజ్జల సురేందర్, కొమ్ముల విజయ, తిగుల్ల కనకయ్య, బండారి సిద్దయ్య, ఎగుర్ల ఎల్లయ్య, సిద్దిరాం భద్రయ్య, బంగారు ప్రేమ్ కుమార్, గౌండ్ల కొండయ్య, వెలుగల యాదగిరి, తిగుల్ల రాకేష్, అందె కిరణ్, కోడూరి వెంకటేష్, రాములు, రాజయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని మర్కుక్‌లో సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, గంగాపూర్-యూసుఫ్ ఖాన్ పల్లిలో సర్పంచ్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా బతుకమ్మ చీరలను బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాలలో సర్పంచుల ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జగదీశ్ సింగ్, వివిధ గ్రామాల డీలర్లు గ్రామాల పంచాయతి కార్యదర్శులు ,గ్రామ మహిళలు, తదితరులున్నారు.

ప్రోటోకాల్ పాటించని ప్రభుత్వ అధికారులు

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిదిలోని పీర్లపల్లి గ్రామంలో యాదవ సంఘం, ఎస్సి కమ్యూనిటీ హాల్, హాస్పిటల్ భవనం శంకుస్థాపన కార్యక్రమంలు జరిగాయని అందులో ఎంపీటీసీ కనీసం సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమం చేయడమేంటని మహేందర్ రెడ్డి ప్రశ్నించారు. కాని నాకు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక సమాచారం లేదు. కనీసం ప్రోటోకాల్ అనేది అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు మాత్రమేనా, అన్నారు. ప్రతిపక్ష పార్టీ ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వడం లేదు అన్నారు. భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ చాలా చక్కగా రాశారని రాజ్యాంగాన్ని కూని చేస్తున్నారని తెలిపారు. ప్రజా స్వామ్య పరిపాలనన లేక నిరంకుశ పాలనను తలపిస్తుందన్నారు. అధికారులకు కనీసం చిత్త శుద్ధి లేదన్నారు. అధికారులకు జీతాలు ప్రభుత్వం సొమ్ము ద్వారా తీసుకుంటున్నారని, రాజకీయ పార్టీలు ఇవ్వడం లేదంటూ మండిపడ్డారు. అదికారులు ముందు ప్రోటోకాల్ తెలుసుకోవాలన్నారు

మంత్రి పర్యటనతో బీజేపీ నాయకుల అరెస్టు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ హుస్నాబాద్ పర్యటన నేపథ్యంలో బీజేపీ నాయకులను బుధవారం హుస్నాబాద్ అక్కనపేట మండల నాయకులను అరెస్టు చేసి హుస్నాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



నవతెలంగాణ-దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గం పరిధిలోని అక్బర్ పేట భూంపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్యను సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమించారు. హైదరాబాద్‌లోని ఎస్సీ,ఎస్టీ కమిషన్ కార్యాలయంలో మంత్రి తన్నీరు హరీష్ రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బక్కి వెంకటయ్య బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా దుబ్బాక నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బక్కి వెంకటయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు ఆస యాదగిరి, బత్తుల స్వామి,కో- ఆప్షన్ సభ్యుడు ఆస స్వామి, బిఆర్ఎస్ నాయకులు గన్నె భూమి రెడ్డి,అధికం బాలకిషన్ గౌడ్,రొట్టె రాజమౌళి,మూర్తి శ్రీనివాస్ రెడ్డి,సర్పంచ్ లు తౌడ శ్రీనివాస్,సద్ది రాజిరెడ్డి, పలువురున్నారు.

ప్రభుత్వ భూమిని పరిశీలించిన తహసిల్దార్, ఎంపీడీఓ

- గూడెంలో ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించిన అధికారులు
- రెడ్డి సంఘ భవనానికి స్థలం కేటాయింపుపై తలెత్తిన వివాదం

నవతెలంగాణ-బెజ్జంకి

గూడెం గ్రామంలో ప్రభుత్వ అభివృద్ధి పనులకు స్థలం కొరత ఏర్పడడంతో గ్రామంలోని 321 సర్వే నంబర్ యందు ప్రభుత్వ భూమిలో పలువురు గ్రామస్తులు నిర్మించిన అక్రమ నిర్మాణాలను అధికారులు జనవరి 5,2023న తొలగించి సుమారు 7 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. పల్లే ప్రకృతి వనం, బృహత్ పల్లే ప్రకృతి వనం, వ్యాయామ కేంద్రం, వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణా పనులకు ప్రభుత్వ భూమి అందుబాటులోకి రావడంతో బుధవారం తహసిల్దార్ వెంకట్ రెడ్డి, ఎంపీడీఓ రాము గ్రామాన్ని సందర్శించి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని పరిశీలించి హద్దులు నిర్ణయించారు. గ్రామంలోని కుల సంఘాల భవనాలకు స్థలం కేటాయింపులో సమస్య ఉత్పన్నమవ్వడంతో పరిష్కరించేల చర్యలు చేపట్టనున్నట్టు తహసిల్దార్ వెంకట్ రెడ్డి తెలిపారు.

రెడ్డి సంఘ భవన స్థలంపై తలెత్తిన వివాదం

గ్రామంలో రెడ్డి సంఘం రెండు వర్గాలుగా విడిపోవడంతో ఇద్దరు అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఇరువురు అధ్యక్షులు ప్రభుత్వ భూమిలో రెండు రెడ్డి సంఘ భవనాలకు స్థలం కేటాయించాలని వివాదం తలెత్తింది.ఇరువురి రెడ్డి సంఘం అధ్యక్షుల వాదనలను లిఖిత పూర్వకంగా సేకరించి పై అధికారుల ఆదేశాల మేరకు స్థలం నిర్ణయిస్తామని తహసిల్దార్ తెలిపారు.

గృహాలున్నోళ్లకే గృహాలక్ష్మి..!

అధికారుల వద్ద మొరపెట్టుకున్న మహిళలు

అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి గృహాలున్నోళ్లకే లబ్ధిదారులుగా ఎంపిక చేసి గృహాలక్ష్మి మంజూరీ పత్రాలు అందజేశారని పలువురు గ్రామ మహిళలు ఎంపీడీఓ రాము, తహసిల్దార్ వెంకట్ రెడ్డి వద్ద మొరపెట్టుకున్నారు. గృహాలక్ష్మి పథకానికి గ్రామంలోని ప్రజలు సమర్పించిన దరఖాస్తుల అధారంగా ప్రత్యేక అధికారుల బృందం విచారణ జరిపి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేశారని..విడతల వారిగా ప్రభుత్వం గృహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందని సంయమనం పాటించాలని ఎంపీడీఓ రాము మహిళలకు సూచించారు.



గృహాలక్ష్మి లబ్ధిదారుల ఎంపికలో అధికారులు ఇండ్లున్నోళ్లకే మళ్లీ ఇండ్లు మంజూరీ చేశారని వితంతువులైన మహిళలను, గుడిసెలో నివసిస్తున్న వారిని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేయగా తహసిల్దార్ వెంకట్ రెడ్డి మరోసారి దరఖాస్తుల వివరాలందజేయండి ప్రభుత్వానికి నివేదిస్తామని సూచించారు. తహసిల్దార్ సూచనతో మహిళలు తమ వివరాలను లిఖిత పూర్వకంగా అందజేశారు. గృహాలక్ష్మి లబ్ధిదారుల ఎంపికలో విచారణ బృందం అధికారులు అవకతవకలకు అస్కారమిచ్చి లబ్ధిదారులను ఎంపిక చేశారని వదంతులు గ్రామంలో వెల్లువెత్తడంతో జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పదో రోజు 'పది ఆకారం'లో ఆశాల సమ్మె

నవతెలంగాణ-దుబ్బాక





తమకు ఫిక్స్‌డు వేతనం రూ.18 వేలను ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను కల్పించాలని, 32 రకాల రిజిస్టర్‌లను ప్రభుత్వమే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆశాలు చేస్తున్న సమ్మె 10 రోజులకు చేరింది. బుధవారం ప్రభుత్వ తీరు పట్ల వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 'పది ఆకారం'లో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆశా లు చేపట్టిన సమ్మె నేటితో పది రోజులైనా ప్రభుత్వంలో చలనం రాకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల తమ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా లు భాగ్యలక్ష్మి, శ్యామల, మంజుల, శారద, అనిత, బాబాయ్, చంద్రకళ, వసుంధర, పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశా వర్కర్లకు ఇస్తున్న పారితోషికం రూ.18 వేలు అందించాలని రుద్రారం ఎంపీటీసీ మంజులత గోపాలస్వామి అన్నారు. ఆశ వర్కర్లకు పిఎఫ్ ఈఎస్ఐ వర్తింపజేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు ప్రమాద బీమాతోపాటు హెల్త్ కార్డును అందించాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్ కల్పించాలన్నారు. ప్రభుత్వం ఆశలతో అదనంగా పనులు చేయిస్తూ వారిపై భారం వేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్‌లను పరిష్కరించడంతో పాటు పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బాలమని, సరస్వతి, కవిత, మాలతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతున్న రాష్ట్ర ప్రభుత్వం

- సమస్యను పరిష్కరించాలని ధర్నా చేస్తే అరెస్టు చేస్తారా
- సీఐటీయూ నాయకుడు అంజయ్య



నవతెలంగాణ-మిరుదొడ్డి

అంగన్వాడి ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని సీఐటీయూ నాయకుడు అంజయ్య అన్నారు. మిరుదొడ్డి మండలానికి చెందిన అంగన్వాడి ఉద్యోగులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత 28 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అంగన్వాడీ ఉద్యోగులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ కు వెళ్లకుండా ఎక్కడికక్కడ పోలీసులు అంగన్వాడీలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా అక్రమ అరెస్టులు చేయడంపై అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం తమ పట్ల మొండిగా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులు సరికాదు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి.
- సిద్ధిపేట జిల్లా కేంద్రంలో రాస్తారోకో



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

ఆశా వర్కర్ల తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తుంటే అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల్ స్వామి ఖండించారు. బుధవారం నాటికి సమ్మె పదవ రోజుకు చేరుకున్న సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటన ఉందని ముందస్తుగా అక్రమంగా ఆశా కార్యకర్తలను అరెస్టును నిరసిస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీజేఆర్ చౌరస్తాలో ఆశా కార్యకర్తలతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల స్వామి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలని కోరుతూ గత పది రోజుల కాలంగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోగా సమ్మెను విచ్ఛినం చేయడానికి అనేక కుట్రలు పన్నుతూ మరోవైపు అక్రమ అరెస్టులకు గురిచేస్తుందన్నారు. ఆశా వర్కర్లకి ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్ ఎస్ఐ సౌకర్యం కల్పించాలని రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షల రూపాయలు కల్పించాలన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం పట్టింపులకు పోయి బెదిరింపులు గురి చేసే మాత్రం సహించబోమని దానికి తగిన గుణపాఠం చెప్తావని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, యూనియన్ నాయకురాలు చెల్లారపు నీరజ, రెడ్డబోయిన బాలమణి, విజయలక్ష్మి, లలిత, కవిత, సంతోష, విజయ, యాదమ్మ, సంరక్ష పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- గజ్వేల్ ఏసిపి ఎం.రమేష్



నవతెలంగాణ- గజ్వేల్

విద్యార్థులు తాము ఎంచుకొన్న కోర్సులో పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని గజ్వేల్ ఏసిపి ఎం.రమేష్ సూచించారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ సమీపంలో గల సురభి దయాకర్ రావు ఫార్మసీ కళాశాల లో కలశాల సెక్రెటరీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ఆదేశాల మేరకు బి ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటెషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏసిపి రమేష్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తమ పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలు బాగుపడాలని కోరుకుంటారని, వారి నమ్మకాన్ని నిజం చేయడానికి విద్యార్థులు కృషి చేసి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని కోరారు. రోజు రోజుకూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో వాటిలో మంచిని గ్రహించి సద్వినియోగం చేసుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మొదటి సంవత్సరం నుంచే క్రమశిక్షణతో పాటు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దాని సాధనకోసం కృషి చేయాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి వుండి ఆన్లైన్లో వచ్చే లింకులను క్లిక్ చేసి మీ వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయడం వల్ల ఇబ్బందులు పడవద్దన్నారు. ఫార్మసీ విద్యకు మంచి భవిష్యత్తు ఉన్నదని, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తలిదండ్రులు గర్వించే స్థాయిలో మీ విద్య కొనసాగాలని సూచించారు. కలశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటరమణ మాట్లాడుతూ కళాశాల సెక్రెటరీ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన వైద్య అందించాలన్న లక్ష్యంతో కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని, కళాశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, వారి సలహాలు సూచనలు పాటిస్తూ విద్యార్థులు వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలని సూచించారు. కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో జరిగే నైపర్, జీ పాట్ వంటి ఎంట్రన్స్ లలో మెరుగైన ర్యాంకు లు సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఫార్మా రంగానికి ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్నదని రాబోయే రోజుల్లో మరిన్ని ఎక్కువ ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం ఉన్నత రాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డాక్టర్ శేష పనీంద్ర, డాక్టర్ ఆర్. నిర్మల, చెరుకు నరేష్ రెడ్డి, సౌందర్య, పూజిత, భారతి, ఈశ్వర్, బి.అరుణ, కృష్ణ, మజీద్, కే.అరుణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

- చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి
- ఏసీపీ రమేష్



నవతెలంగాణ-జగదేవపూర్

మండల పరిదిలోని అలియారాజపేట గ్రామంలో గల సెంట్ విన్సెంట్ హై స్కూల్‌లో గల విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాల గురించి సైబర్ నేరాల గురించి ఏసీపీ రమేశ్ గౌడ్ అవగాహన కల్పించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ప్రత్యేక షెడ్యూల్లో భాగంగా బుధవారం షీటీమ్ ప్రాముఖ్యత , నిర్వహించే విధుల గురించి, సైబర్ నేరాల గురించి, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, పరిణామాల గురించి వివరించారు. ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాల గురించి వివరించారు. మహిళలు, పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి తెలిపారు. సోషల్ మీడియా వల్ల జరిగే లాభ నష్టాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాల గురించి వివరించారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్ 100, సిద్దిపేట షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434 స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ చంద్రమోహన్, స్కూల్ ప్రిన్సిపల్ సార్ జానెట్, ఉపాధ్యాయ బృందం, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది శ్రీరాములు, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు శ్యామల, లావణ్య, మహేష్, రామచంద్రారెడ్డి ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పూర్తి నష్ట పరిహారం ఇవ్వాలి



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు ప్రభుత్వం పూర్తి నష్టపరిహారాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం కార్యదర్శి శివలింగు కృష్ణ అన్నారు. బుధవారం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు నష్టపరిహారం త్వరగా అందివ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్నసాగర్ నుంచి తపాస్ పల్లి డ్యాంలోకి నీటిని సరఫరా చేయడానికి లింక్ కెనాల్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ కాలువ కొరకు భూమిని కోల్పోయిన నిర్వాసితులకు పూర్తి పరిహారం అందజేయాలని వినతిపత్రం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో అందజేశామన్నారు. ప్రభుత్వం వెంటనే మేలుకొని నష్టపోయిన రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. వారి పట్ల సానుకూల దృక్పథంతో పరిహారాన్ని అందించాలని కోరారు. అంతేకాకుండా ఆర్ అండ్ ఆర్ కాలనీలో బాధితులకు ఇప్పటివరకు ప్యాకేజీలు అందలేదన్నారు. మల్లన్న సాగర్ ముంపు బాధితులకు అడుగడుగున అన్యాయమే జరుగుతుందని పేర్కొన్నారు. ముంపు బాధితులకు రావలసిన అన్ని ప్యాకేజీలు వెంటనే విడుదల చేసి జరిగిన నష్టాన్ని కొంచెమైనా పూడ్చే ప్రయత్నం చేయాలన్నారు. ప్యాకేజీ అందలేదని ఇటీవల సింగయపల్లి చౌరస్తా వద్ద బాధితులు ధర్నా రాస్తారోకో నిర్వహించారని గుర్తు చేశారు. రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. తపస్ పల్లి డ్యాంకు భూములు కోల్పోయిన మెదినీపూర్, కొనాయి పల్లి, మంగోల్, తపాస్ పల్లి, లకుడారం రైతులు చాలా తీవ్రంగా నష్టపోయారని తెలిపారు ఈ కార్యక్రమంలో గజ్వేల్ తహసీల్దార్ బాలరాజు, సిపిఐ నాయకులు బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

మీడియాపైన బీజేపీ దాడిని అపకపోతే ఉద్యమిస్తాం

- బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్



నవతెలంగాణ-సిద్దిపేట

మీడియాపైన బీజేపీ దాడిని అపకపోతే ఉద్యమిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ అన్నారు. పత్రిక స్వేచ్ఛపై దాడికి వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వ దిష్టిబొమ్మను భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక కార్యక్రమాలను నిరంతరం ఎండగడుతూ, ప్రజలకు చేరువ చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా న్యూస్‌క్లిక్ ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ హెచ్ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిలను ఢిల్లీ పోలీసులు క్రూరమైన యూఏ పఏ ఆరోపణలను ఉపయోగించి అరెస్టు చేశారన్నారు. ఢిల్లీకి చెందిన పలువురు జర్నలిస్టుల ఇళ్లపై 'రైడ్' చేసి, వారి ల్యాప్‌టాప్‌లు, ఫోన్‌లను ఢిల్లీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారతదేశం స్థానం, దిగువ 20 దేశాలకు దిగజారడం ప్రమాదమన్నారు. ప్రభుత్వంకు ప్రజలకు వారధిగా నాలుగో స్తంభంగా సూచించబడే మీడియా స్వేచ్ఛను భంగం కలిగించడం సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇలాంటి దిక్కుమాలిన చర్యలు ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్పి, అధికార అహంకారాన్ని దించుతారన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్, ఆముదాల రంజిత్ రెడ్డి, నాయకులు భాను, హరీష్, శ్రవణ్, ప్రేమ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక శారీరక ఉల్లాసం



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యం కూడా కలుగుతుందని సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట మండల పరిషత్ కార్యాలయంలో సిద్దిపేట అర్బన్, రూరల్ గ్రామాలకు కెసిఆర్ స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గ్రామాలలో క్రీడలను ప్రోత్సహించడానికి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందన్నారు. క్రీడా ప్రాంగణాల్లో ఆటలు ఆడుకోవడానికి కావలసిన క్రీడా వస్తువులను కూడా మంత్రి హరీష్ రావు చొరవతో పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందులో 27 రకాల ఆట వస్తువులు, వ్యాయామానికి సంబంధించిన వస్తువులు కూడా ఉన్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో మరింత రాణించి గ్రామాలకు మండలానికి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ సిద్దర బోయిన శ్రీనివాస్, డిప్యూటీ నాగేందర్, రూరల్ జెడ్పిటిసి శ్రీహరి గౌడ్, అర్బన్ వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం, ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కమలాకర్ రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మనో చేతన పాఠశాల విద్యార్థులకు అన్నదానం

నవతెలంగాణ-చేర్యాల: చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన ఫోటోగ్రాఫర్స్ యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి, నందిని ఫోటో స్టూడియో యజమాని ఇప్పకాయల పవన్ తండ్రి నర్సయ్య 13వ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణ కేంద్రంలోని మనో చేతన పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పవన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



నవతెలంగాణ-నంగునూరు

సమ్మె కాలంలో గ్రామపంచాయతీ కార్మికులకు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి హామీని విస్మరించడం సరైన చర్య కాదని సీఐటీయూ నంగునూరు మండల నాయకులు దేవులపల్లి రాజమౌళి పేర్కొన్నారు. మంగళ, బుధవారం రోజుల్లో నంగునూరు ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని గతంలో 32 రోజులు సమ్మె చేసిన సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం దహన సంస్కారాలకు సంబంధించినటువంటి వాటిని మాత్రమే కొంతమేరకు పెంచి, మిగతా వాటిని విస్మరించిందన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే తిరిగి సమ్మెలోకి వెళ్తామని సందర్భంగా హెచ్చరించారు. బుధవారం పాలమాకుల పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీ కార్మికులు కనకవ్వ, లచ్చవ్వ, కృష్ణ, లచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
5
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం | 05 అక్టోబరు 2023 | www.navatelangana.com

సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదు



నవతెలంగాణ-తొగుట

తమ న్యాయమైన డిమాండ్ లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని ఆశా కార్యకర్తలు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వద్ద ఆశాలు చేస్తున్న సమ్మె 10వ రోజుకు చేరుకున్న సందర్భంగా భిక్షాటన చేసి నిరసన తెలి పారు. అనంతరం వారు మాట్లాడుతూ కనీస వేతనం పెంచాలని ఆశాలు సమ్మె చేస్తూన్న సందర్భంగా పర్యటనలో మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తే మీకేమైనా నీతి,నిజాయితీ ఉందా అంటూ మంత్రి ప్రశ్నించడం బాధాకరమన్నారు. మంత్రి కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని ఆశా కార్మికులు అడిగితే వేరే రాష్ట్రలలో ఇస్తున్న వేతనాలు గురిం చి చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు.పెంచిన పని భారంతో గ్రామలల్లో తిరిగి రోగాల బారిన పడుతున్నామని, జ్వరాలు, వ్యాధులు వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.

ప్రజాస్వామ్యం ఎక్కడుంది.. ప్రశ్నిస్తే అణచి వేస్తుండ్రు

- బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే బట్టలు వేసుకునే పరిస్థితి ఉండదు
- లక్షల కోట్ల ప్రజా డబ్బును దోచుకుంటుండ్రు
- ఈ సారి ఎన్నికల్లో సైలెంట్ ఓటింగ్ జరుగుతది
- సర్వమత ప్రార్థనలు చేసిన మైనంపల్లి హన్మంతరావు, రోహిత్





నవతెలంగాణ-మెదక్

తెలంగాణాలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఎక్కడ ఉందని, ప్రశ్నిస్తే అణచి వేస్తున్నారని మల్కాజిగిరి ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, మైనంపల్లి స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ రోహిత్ పేర్కొన్నారు. బుధవారం మెదక్ నియోజకవర్గంలోని ఏడుపాయల వనదుర్గ ఆలయం, మెదక్ చర్చి, దర్గాలను సందర్శించి సర్వమత ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మెదక్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గాలు మాత్రమే అభివృద్ధి చెందాయని, జిల్లాలోని మెదక్, దుబ్బాక, నర్సాపూర్ నియోజకవర్గాలు ఏం పాపం చేశాయని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు ఏమి చేసినా అడిగేటోల్లు లేరు, ప్రస్తుతం ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ జాగలను అమ్మేస్తున్నారని, ఆర్టీసిని విలీనం చేసింది అదే దురాలోచనతోనని విమర్శించారు. మరో సారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తె బట్టలు వేసుకునే పరిస్థితి ఉండదన్నారు. తెలంగాణలో ప్రతి మనిషి పై లక్షన్నర అప్పు ఉందన్నారు. ప్రభుత్వానికి పన్ను రూపంలో చెల్లిస్తున్న లక్షల కోట్ల డబ్బులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల డబ్బులో బీఆర్ఎస్ ప్రభుత్వం 30 శాతం కమిషన్ తీసుకున్నారన్నారు. డబ్బులమయం బీఆర్ఎస్‌లో కొనసాగుతుందని, ఈ సారి ఎన్నికల్లో సైలెంట్ ఓటింగ్ జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి తాను చేరగానే తన వారికి దళిత బంద్, బీసీ బంద్ లు ఇవ్వమంటున్నారని తెలిపారు. డబ్బుల మూటలు పట్టుకొని మెదక్‌కు ప్యారచుట్‌లో వస్తున్నారని కొందరు కామెంట్ చేయడం సరికాదన్నారు. తాను మెదక్ జిల్లా బిడ్డనని గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా పని చేసినట్లు తెలిపారు. మెదక్ ఎమ్మెల్యేగా, తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడిగా పదవుల్లో ఉండి ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందున్నట్లు తెలిపారు. భయపడి పారిపోయే వ్యక్తిని కాదని, హైదరాబాద్‌లో ఉన్నా అందరినీ ఆదుకున్నట్లు తెలిపారు. రోజుకు 400 కిలో మీటర్లు తిరిగిన చరిత్ర తనకు ఉందని, నమ్ముకున్న వారిని ప్రాణం పోయినా వదలనని తెలిపారు. తెలంగాణలో ఈ సారి కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎవరికి ఓటు వేయాలో ప్రజలకు తెలుసని అన్నివర్గాలు చెప్పలేక పోతున్నారని ఓటు రూపంలో బుద్ధి చెపుతారన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రభాత రావు, సురేందర్ గౌడ్, జీవన్, పవన్, మహేందర్ రెడ్డి, పరుశురాం, గంగా నరేందర్, సుభాష్ చంద్రబోస్, రాజీ రెడ్డి, ఆవుల గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవిన్యూ డివిజన్ సాధన కోసం 11న నాలుగు మండలాల బంద్

- జేఏసీ చైర్మన్ పరమేశ్వర్, జెడ్పి ఫ్లోర్ లీడర్ కొండల్ రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 11 న చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ పరమేశ్వర్, కాంగ్రెస్ జెడ్పి ఫ్లోర్ లీడర్ గిరి కొండల్ రెడ్డి తెలిపారు. చేర్యాల మండల కేంద్రంలోని వాసవి గార్డెన్ లో బుధవారం జేఏసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి నాయకత్వం వహించిన చేర్యాల ప్రాంతానికి రాష్ట్ర ఏర్పడిన తర్వాత చేర్యాలకు సీఎం కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ డివిజన్ సాధించేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. 11న జరిగే బందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించి భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో అఖిలపక్ష చేసిన నాయకులు పుర్మ ఆగం రెడ్డి, ఆముదాల మల్లారెడ్డి ఆది శ్రీనివాస్, అందె అశోక్, మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు, కౌన్సిలర్ చెవిటి లింగం, ఆలేటి యాదగిరి, గద్దల మహేందర్, పబ్బోజు రాములు చారి, ఈరి భూమయ్య, ముస్త్యాల యాదగిరి, బుట్టి సత్యనారాయణ, రాళ్లబండి నాగరాజు, బిజ్జ రాము, సుందరగిరి భాస్కర్, రామడుగు బాలరాజు, కొంగరి వెంకట్ మావో, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జంగిలి యాదగిరి, బండకింది అరుణ్, గోనెపల్లి రమేష్, తాడెం వెంకట స్వామి, కొంగరి వెంకటస్వామి, వెంకట్ రెడ్డి, కుమార్, చంద్రం పాల్గొన్నారు.

నాయకుడిగా కాదు సేవకునిగా ఉంటా మైనంపల్లి



నవతెలంగాణ-పాపన్నపేట

మెదక్ ప్రజల సేవకునిగా ఉంటానని మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. ఏడుపాయల వన దుర్గ భవాని మాతను మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి వేలాది మంది కార్యకర్తల నీరాజనాల మధ్య అడుగడుగునా ఘన స్వాగతం పలుకగా, ఏడుపాయలకు చేరుకున్నారు, ఏడుపాయల ఆలయ సిబ్బంది, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు, వీరు ఇటీవల బిఆర్ఎస్ వదిలి ఢిల్లీలో ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున కార్గే, పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన తర్వాత మొట్టమొదటిసారిగా మెదక్ జిల్లా లోని ఏడుపాయలకు చేరుకున్నారు. దీంతో వేలాది మంది కార్యకర్తలు పోతాన్ శెట్టిపల్లి నుంచి మంబోజిపల్లి మీదుగా ఏడుపాయల కమాన్ వరకు డప్పు చప్పుళ్ళు, భాజా భజంత్రీలతో, టపాసులు కాలుస్తూ వారికి అనుకూలంగా నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి కార్యకర్తలు పెద్ద ఎత్తున గజమాలలు వేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ తాము గెలిస్తే పాలకులుగా కాకుండా సేవకులుగా పనిచేస్తామని వెల్లడించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు అయన వెల్లడించారు. పాపన్నపేట మండల నాయకులు ప్రశాంత్ రెడ్డి, మెదక్ సీనియర్ నాయకులు సురేందర్ గౌడ్‌తో పాటు పెద్ద ఎత్తున నాయకులు వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు,

తండాల అభివృద్ధి కేసీఆర్ ఘనతే

- గిరిజన, శిశు,సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



నవతెలంగాణ-అక్కన్నపేట

కేసీఆర్ హయాంలోని గిరిజన తండాలన్నీ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని గిరిజన అభివృద్ధి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. బుధవారం అక్కన్నపేట మండలం కేంద్రంలోని చౌరతండాకు వెళ్లేదారిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో గిరిజనుల కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా తండాలకు బీటీ రోడ్లు, 3146 కొత్త గ్రామపంచాయతీలు చేసిన ఘనత బీఆర్ఎస్‌దేనని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో తండాలకు వెళ్లాలంటే కనీసం బైకు దారి కూడా ఉండేది కాదని, తండావాసులు ఎన్నో ఇబ్బందులు పడేవారని తెలియజేశారు. కాంగ్రెస్ హయాంలోనే తండాలో ఉండేటువంటి గిరిజనులు అంతా చదువులకు దూరమయ్యారని , ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ప్రతి గిరిజన తండాలో స్కూలు ఏర్పాటయ్యాయని, ప్రతి తాండాకి బీటీ రోడ్డు , మంచినీటి, కరెంటు సౌకర్యం అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఎమ్మెల్యే సతీష్ కుమార్ హయాంలో హుస్నాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా గిరిజనులకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, జడ్పిటిసి భూక్యమంగా , ఎంపీపీ లక్ష్మీ బీలు నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిని తిరుపతి రెడ్డి, అక్కన్నపేట మండల పార్టీ అధ్యక్షులు పెసరు సాంబరాజు, ఇతర నాయకులు, ముఖ్య కార్యకర్తలు, పాల్గొన్నారు.

డివిజన్ వచ్చేదాకా పోరాటానికి అండగా ఉంటాం

- చేర్యాల దస్తావేజులేఖరుల సంఘం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల డివిజన్ వచ్చేదాకా జేఏసీ చేస్తున్న పోరాటాలకు అండగా ఉంటామని చేర్యాల దస్తావేజులేఖరుల సంఘం గౌరవ అధ్యక్షులు మంకెన అంజిరెడ్డి తెలిపారు. రెవెన్యూ డివిజన్ సాధన కోసం చేర్యాల పాత బస్టాండ్ వద్ద చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షలు బుధవారం 24వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో చేర్యాల దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు కూర్చోగా వారికి జేఏసీ చైర్మన్ పరమేశ్వర్, జేఏసీ కో చైర్మన్ ఆగంరెడ్డి కండువాలు కప్పి దీక్షలను ప్రారంభించారు. దీక్షల నిర్వహణ కోసం రిటైర్డ్ ఆర్డీవో ముస్త్యాల దేవదాస్ రూ. 5వేలు, దీక్షలో కూర్చున్న వారు రూ. 2వేలు అందజేశారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ రాజలింగం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మండల శ్రీరాములు దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడుతూ చేర్యాల నియోజకవర్గం, తాలూకా కోల్పోవడం దురదృష్టకరమన్నారు. చేర్యాల ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకురావడం కోసం తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. అనంతరం దస్తావేజులేఖరుల సంఘం నాయకులు మాట్లాడుతూ చేర్యాల ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఈ ప్రాంత అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం చేర్యాల డివిజన్ వచ్చేంతవరకు తమ వంతుగా పోరాటంలో ముందుంటామని తెలిపారు. దీక్షల్లో తాడెం వెంకటస్వామి, పచ్చిమట్ల శ్రీధర్, అంబాల శ్రీనివాస్, తాడెం శ్రీనివాస్, ఎండి. ఆరిఫ్, స్వర్గం నవీన్, ఎర్రమైసగళ్ల బుచ్చి బాబు,తాడెం ప్రశాంత్, పాల భరత్ కుమార్, రామగళ్ల శ్రీనివాస్, తాడెం ప్రవీణ్, తుమ్మ కృష్ణ, మ్యాడం రవి చంద్ర, పంజా వెంకటేష్, రావుల భారత్, సాయి రేవంత్, బొంగోని భాస్కర్, ఎండి. షాదుల్లా, బండ్ల సంపత్, గుర్రం కిరణ్, చందు, రాజేష్, శివ ప్రసాద్,సాయి, శ్రీధర్, అజయ్, మహేష్, నరేష్, కూర్చున్నారు. సంఘీభావం తెలిపిన వారిలో మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు, కౌన్సిలర్ చెవిటి లింగం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, మిట్టపల్లి నారాయణ రెడ్డి, తడక లింగం గుప్తా, బండ కింది అరుణ్ కుమార్, పాల లక్ష్మీ నారాయణ, కురారం బాలనర్సయ్య, మేడిపల్లి చందు, బిజ్జ రాము, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటల్లో రాణించాలి



నవతెలంగాణ-వర్గల్

మహాత్మ జ్యోతి బాపులే గురుకుల బాలికల విద్యాలయంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న అండర్ -19 క్రీడలు బుధవారం ముగిశాయని ప్రధానో ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి తెలిపారు. అథ్లెటిక్స్ 3000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో అశ్విత (వర్గల్) జె. రమ్య (ముత్తంగి) జి. సాయి నిఖిల (వర్గల్) 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో ఎ. ఆశ్రిత (వర్గల్) వైష్ణవి (జోగిపేట్) పూజ 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ ,ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో పి .అశ్విత (వర్గల్) వైష్ణవి (జోగిపేట్) నికిత (ముత్తంగి) 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ తృతీయశ్రేణుల్లోసి హెచ్. శ్రావణి (వర్గల్) పూజ (వర్గల్) నిఖిత (ముత్తంగి)200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో పి పూజ (వర్గల్) శ్రావణి (వర్గల్) స్ఫూర్తి (తూప్రాన్) 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ ,ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో శ్రావణి (వర్గల్) స్ఫూర్తి (వర్గల్) పూజ (వర్గల్) విజేతలుగా నిలిచారు. డిస్కస్ త్రో లో ప్రథమ ,ద్వితీయ ,తృతీయ శ్రేణుల్లో నందిని(నర్సాపూర్) అక్షయ (వర్గల్) సమన్విత (వర్గల్) విజేతలుగా నిలిచారు. షాట్ పుట్ లో ప్రథమ, ద్వితీయ ,తృతీయ శ్రేణుల్లో పూజా (వర్గల్) ముక్తాబాయి (వర్గల్) నందిని (నర్సాపూర్) విజేతలుగా నిలిచారు. హై జంప్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో శ్రావణి (వర్గల్) అక్షయ (తూప్రాన్) పూజ (వర్గల్) పూజబాయి (ముత్తంగి) విజేతలుగా నిలిచారు. లాంగ్ జంపులో ప్రథమ ,ద్వితీయ, తృతీయ శ్రేణుల్లోశ్రావణి (వర్గల్) కీర్తన (తూప్రాన్) పూజ వర్గల్ విజేతలుగా నిలిచారు వాలీబాల్ లో ప్రథమ బహుమతి (వర్గల్)ద్వితీయ బహుమతి(ముత్తంగి) విజేతలుగా నిలిచారు. ఖోఖో లో ప్రథమ బహుమతి(వర్గల్)ద్వితీయ బహుమతి (దుబ్బాక)విజేతలుగా నిలిచారు. కబడ్డీలో ప్రథమ బహుమతి జోగిపేట్ ద్వితీయ బహుమతి (వర్గల్) విజేతలుగా నిలిచారు. టెన్నికాయిట్లో ప్రథమ బహుమతి (వర్గల్) ద్వితీయ బహుమతి (ముత్తంగి) నిలిచారు. చెస్ లో ప్రథమ బహుమతి (వర్గల్) ద్వితీయ బహుమతి (సదాశివపేట)విజేతలుగా నిలిచారు క్యారంలో ప్రథమ బహుమతి (వర్గల్) ద్వితీయ బహుమతి(తూప్రాన్) విజేతలుగా నిలిచారు. మార్చ్ ఫాస్ట్‌లో ప్రథమ బహుమతి (వెల్దుర్తి) ద్వితీయ బహుమతి (నర్సాపూర్) విజేతలుగా నిలిచారు. రిలేస్ లో400 మీటర్స్ లో వర్గల్ ప్రథమ శ్రేణిలో (ద్వితీయ) శ్రేణిలో (తూప్రాన్) విజేతలుగా నిలిచారు. వ్యక్తిగత ఛాంపియన్షిప్ శ్రావణి (వర్గల్) ఓవరాల్ ఛాంపియన్షిప్ వర్గల్ గెల్పొందినందుకు పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి గారు అభినందనలు తెలుపుతూ గెలిచిన విద్యార్థులకు నవోదయ ప్రిన్సిపల్ జగదీష్ గారి చేతులమీదుగా బహుమతుల ప్రధానం జరగనున్నట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన పీటీలకు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు

గ్రామ పంచాయతీ భవనాలు ప్రారంభోత్సవం



నవతెలంగాణ-జగదేవపూర్

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన గ్రామపంచాయతీలను శ్రీకారం చుట్టారు. కాగా నూతన గ్రామపంచాయతీ భవనాలను కూడా మంజూరు చేసిన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీల భవనాలు నిర్మాణం పూర్తి అయ్యాయి. అందులో భాగంగా మండల పరిదిలోని గ్రామ పంచాయతీ భవనాలను బుధవారం ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్లతో కలిసి నూతన గ్రామ పంచాయతీలను ప్రారంభించారు. సర్పంచ్‌లను తమ స్థానాల్లో కూర్చోబెట్టి ఆశీర్వదించారు. రామచంద్రాపూర్, చిన్న కిష్టాపూర్ , జంగం రెడ్డిపల్లి , వట్టిపల్లి ,బస్వాపూర్, ఎల్లాయిగూడ,పిటి వెంకటాపూర్, అనంతసాగర్ , నిర్మల్ నగర్,ఇటిక్యాల, పీర్లపల్లి, జగదేవపూర్ గ్రామాల్లో నూతన పనులకు శంకుస్థాపన, గ్రామ పంచాయతీల ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలేశం గౌడ్, జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, పిఏసీఎస్ చైర్మెన్ ఇంద్రసేనా రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గుండ రంగారెడ్డి, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు రచర్ల నరేష్, ఎంపిటిసిల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ ఎంపిటిసిల ఫోరమ్ మండల అధ్యక్షుడు కావ్య దర్గయ్య మండల నాయకులు ఆయా గ్రామాల సర్పంచ్‌లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో పల్లె దావఖానా ప్రారంభం



నవతెలంగాణ-చేగుంట

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే ఈ రోజు ప్రజలందరికీ హక్కులు కల్పించబడుతున్నాయని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బుధవారం పల్లె దావఖానాను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు మాట్లాడుతూ రాజకీయ రంగంలో మహిళలు ఎదగాలనే ఉద్దేశంతో మహిళా బిల్లును పార్లమెంటులో నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టారన్నారు. మహిళలకు నిన్నటి వరకు రాజకీయపరంగా రిజర్వేషన్లు లేవని కేవలం మోడీ ప్రభుత్వం వల్లే 33% రిజర్వేషన్ను పార్లమెంట్ సాక్షిగా ఆమోదం చేయించారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడి, ఆశా కార్యకర్తలు అందరికంటే బాగా పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. ప్రతి 5000 మందికి ఒక ఆసుపత్రి ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పల్లె దవఖానాను ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి గ్రామ సర్పంచ్ ఎల్లారెడ్డి, ఎంపీటీసీ గణేష్, గ్రామనాయకుడు మహిపాల్ రెడ్డి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య



నవతెలంగాణ-పాపన్నపేట

ఓ గృహిణి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్న పేట మండల పరిధిలోని మల్లంపేట లో బుదవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మల్లంపెట గ్రామానికి చెందిన సైదు లక్ష్మి (28)కి సైదు నాగయ్యతో వివాహమై, సంసారం సాఫీగా సాగుతూ ముగ్గురు సంతానం కూడా కల్గింది. అయితే గత కొన్ని రోజులుగా ఇరువురి మధ్య చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి సైతం ఇరువురి మధ్య గొడవ తలెత్తి ఆవేశానికి లోనైన లక్ష్మి అందరు నిద్రిస్తున్న సమయంలో ఇంటి నుంచి వెళ్ళి శివారులో ఉన్న రెడ్డి చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో తెల్లవారు మెలుకవ వచ్చిన కుటుంబీకులకు లక్ష్మి కనిపించకపోవడంతో చుట్టూ ప్రక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. రెడ్డి చెరువు వద్దకు వెళ్ళి పరిశీలించగా చెరువులో నీటిపై ఓ మహిళ మృతదేహం తెలియడం గుర్తించిన కుటుంబీకులు, వెంటనే గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసి పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. పాపన్నపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

బైక్ ర్యాలీకి భారీగా తరలి వెళ్లిన ముదిరాజ్‌లు



నవతెలంగాణ-తొగుట

మహాగర్జన ర్యాలీకి వెంకటరావుపేట గ్రామం నుంచి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బుధవారం ముదిరాజ్ హక్కుల సాధన కోసం మహాగర్జన ర్యాలీకి వెంకటరావుపేట గ్రామం నుంచి చలో గజ్వేల్ భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. వెంకటరావుపేట ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గంగొళ్ల రాజు, ఎంగలి రాములు, తిప్పరమైన నర్సింలు, పంది నరసింహులు, బొగ్గుల నర్సింహులు, కంకణాల నరసింహులు, పిట్ల వెంకటయ్య,వొలపు నారాయణ ముదిరాజు పెద్దలు,యువత తదితరులు భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేసినట్లు వారు తెలిపారు.

అంగన్వాడీల అరెస్టు అప్రజాస్వామికం



నవతెలంగాణ-చిన్నకోడూరు

తమ న్యాయ బద్ధమైన హక్కులను సాధించుకోవడానికి ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామికం అని తెలంగాణ రైతు సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు చల్లారపు తిరుపతి రెడ్డి అన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన అంగన్వాడీలు ఆఫ్రినా, భాగ్యలక్ష్మిలను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. అర్ధరాత్రి ఇళ్లలోకి పోయి మహిళలని చూడకుండా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనమన్నారు.

సిద్దిపేట రైలు ప్రయాణికులకు నిరాశ



నవతెలంగాణ-సిద్దిపేట

మంగళవారం సాయంత్రం సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వెళ్లిన ట్రైన్ కోసం బుధవారం ఉదయము 6 గంటలకు సిద్దిపేట స్టేషన్‌కు సుమారు వందమంది ప్రయాణికులు ట్రైన్ కోసం వేచి చూసి నిరాశ చెందారు. అక్కడ గదిలో నిద్రిస్తున్న సిబ్బందిని ప్రయాణికులు లేపి అడగగా ప్రతి బుధవారం ట్రైన్ సెలవు అని సమాధానం ఇచ్చారు. అక్కడికి వచ్చిన ప్రయాణికులు నిరాశతో వెనుతిరిగారు. రైల్వేస్టేషన్లో ఎక్కడ సూచిక బోర్డులు లేవని, బుధవారం సెలవు అని బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



నవతెలంగాణ-జగదేవపూర్

మండల కేంద్రంలో గల ఉప తపాలా కార్యాలయంలో సిబ్బంది బుధవారం పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో సమ్మె చేపట్టారు. తమకు శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదన్నారు. తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. టార్గెట్‌ల పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నారని తెలిపారు. వెంటనే తమ శ్రమకు తగిన వేతనం ఇస్తూ న్యాయం చేయాలని కోరారు.

మాజీ సర్పంచ్ యాదగిరికి కళా రత్న అవార్డు



నవతెలంగాణ-కొండపాక: కొండపాక మండలం మర్పడగ మాజీ సర్పంచ్ తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుడు పుల్లూరు యాదగిరికి బహుజన సాహిత్య అకాడమీ కళా రత్న నేషనల్ అవార్డును ప్రకటించింది. ఈ నెల 15న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకొనున్నారు. అవార్డుకు ఎంపిక చేస్తూ ఆహ్వాన పత్రాన్ని అవార్డు సెలక్షన్ కమిటీ అధ్యక్షులు రాధాకృష్ణ యాదగిరికి పంపించారు. యాదగిరి సాంస్కృతిక సారధి కార్యక్రమాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల వివరాలను ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ ఉద్యమంలో ధూమ్ దాం కార్యక్రమాల్లో పాల్గొని తెలంగాణ సాధన కోసం ఆట పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేయడంలో తన పాత్ర పోషించారు.

నేడు సిద్దిపేటలో ఆసుపత్రి ప్రారంభోత్సవం

నవతెలంగాణ-నంగునూరు: రాష్ట్ర మంత్రి హరీశ్ రావు చేతుల మీదుగా గురువారం ఉదయం 9 గంటలకు ఆసుపత్రి ప్రారంభోత్సవం జరుగుతుందని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, సోసైటీ చైర్మెన్లు, ఆత్మ కమిటీ చైర్మన్, మండల, గ్రామ రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, బీఆర్ఎస్ పార్టీ మండల, గ్రామ కమిటీ అధ్యక్షులు, గ్రామ స్థాయి మహిళా నాయకులు,యువజన , విద్యార్థి విభాగాల నాయకులు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముదిరాజ్ సింహగర్జనకు తరలివెళ్లిన నాయకులు

నవతెలంగాణ-వర్గల్: చట్టసభల్లో తమకు సముచిత న్యాయం ఇవ్వాలని,10 వేల కోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలనే పలు డిమాండ్లతో గజ్వేల్ పట్టణంలో జరిగే ముదిరాజుల సింహ గర్జన ర్యాలీకి వర్గల్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శ్రీరామ్ నర్సింలు ముదిరాజ్ అధ్వర్యంలో ముదిరాజులు భారీ ఎత్తున బయలుదేరారు. తమ హక్కుల సాధన కోసం మహా గర్జన భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ లో నియోజకవర్గం నుంచి సుమారుగా 30 వేల మంది ముదిరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన మాకు బీసీ (డి) నుంచి బీసీ (ఏ) లోకి మార్చాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ మత్స్యకార సంపద కల్పించాలన్నారు. ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లో జరుగనున్న భారీ బహిరంగ సభలో తమ ఐక్యత ప్రభుత్వానికి చూపిస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పసుల రమేష్ ముదిరాజ్, పసుల లింగం, జెల్ల మల్లేష్ ముదిరాజ్, ఎలుకంటి వెంకటేశం ముదిరాజ్,నెంటూర్ యాదగిరి ముదిరాజ్ పాల్గొన్నారు

డీసీసీబీల ద్వారా రూ 2100 కోట్ల రుణాలు

- ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ-వర్గల్

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 50 డీసీసీబీల ద్వారా రూ 2100 కోట్ల రుణాలు అందజేసినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు చిట్టి దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆలాగే రూ 600 కోట్ల డిపాజిట్లు ఉన్నట్లు స్పష్టం చేశారు. డిసిసిబి బ్యాంకుల ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాకు రూ 240 కోట్ల రుణమాఫీ వర్తించగా, ఇప్పటికే 120 కోట్లు మాఫీ చేసినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ కృషితో నూతనంగా ఆర్బిఐ అనుమతితో కొత్తగా 5 డిసిసిబి బ్యాంకులు మంజూరి కాగా, వర్గల్, ముంద్రాయి, న్యాలకల్, సిర్గాపూర్, దుద్దెడ ప్రాంతాలలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 24 ఏటీఎంలు పనిచేస్తుండగా , కొత్త బ్యాంకుల వద్ద మరో 4 ఏటీఎంలు అందుబాటులోకి తేనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ రామకృష్ణారెడ్డి , బ్రాంచ్ మేనేజర్ నర్సింహ రెడ్డి , ఉపాధ్యక్షులు మంజుల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.